ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

ఆదివారం 21 సెప్టెంబరు 2025

తల్లీబిడ్డను కాపాడబోయి..

● అశ్రునయనాల మధ్య

స్వగ్రామంలో గణేశ్ అంత్యక్రియలు



గణేశ్ (ఫైల్)

రాయచోటి పట్టణంలో శుక్రవారం సాయంత్రం 6.45 గంటల నుంచి రాత్రి 8.45 గంటల వరకు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి సంభవించిన వరదల్లో డ్రైనేజీ కాలువలో కొట్టుకుపోతున్న తల్లీ బిడ్డలను కాపాడబోయి వరిగెల గంగయ్య అలియాస్ గణేశ్ ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామం బొట్లచెరువుకు చెందిన వరిగెల చిన్నప్ప, పార్వతి దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా మిగిలిన నలుగురు కొడుకులతో కలిసి చిన్నప్ప కుటుంబ సభ్యులు రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల వెంకటేశ్వర వీధిలో నివాసం ఉంటున్నారు. రజక కులానికి చెందిన వీరు అంతా రజక వృత్తిని కొనసాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మృతుడు గణేశ్‌కు 10 సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే భార్య అతనితో విడాకులు తీసుకుని వేరే వివాహం చేసుకుంది. ప్రస్తుతం గణేశ్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్ష బీభత్సానికి డ్రైనేజీ కాలువలు వీధులు, వాగులు, పొంగి పొర్లడంతో వెంకటేశ్వర వీధిలో నివాసముంటున్న పాలన్నగారిపల్లెకు చెందిన షేక్ మున్నీ, ఆమె కుమారుడు ఇలియాస్‌లు ప్రమాదవశాత్తు డ్రైనేజీ కాలువలో పడి కొట్టుకొని పోతుండగా వారిని కాపాడేందుకు ప్రయత్నించిన గణేశ్ కూడా వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు గణేశ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి శనివారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా రజక సంఘం నేతలు రమేశ్‌బాబు, శ్రీనివాసులు, వెంకట్రమణ తదితరులు గణేశ్ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే గ్రామ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



తల్లీకొడుకును రక్షించబోయిన వ్యక్తి పడిపోయిన కాలువ ఇదే..

విధి వంచితురాలు మున్నీ..

ఆరు సంవత్సరాల తన బిడ్డతో సహా చనిపోయిన మృతురాలు మున్నీ విధివంచితురాలు.. రామాపురం మండలం పాలన్నగారిపల్లెకు చెందిన ఈమెకు ఇద్దరు పిల్లలు. భర్తతో విభేదాల కారణంగా రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో పిల్లలతో కలిసి ఉంటోంది. శుక్రవారం రాత్రి వర్షం కురిసే సమయంలో.. తన చిన్న కొడుకు ఇలియాస్ (6)కు ఏదైనా కొనిపించాలని సమీపంలో ఉన్న అంగడికి తీసుకెళ్లింది. అంగడి సమీపంలో వీళ్లు నిలబడి ఉన్న మురికినీటి కాలువపైన ఉన్న బండ విరిగి పడి.. ఒకసారిగా ఇలియాస్ వర్షపునీటిలో కొట్టుకుపోయాడు. దీంతో మున్నీ (27) బిడ్డను కాపాడుకునేందుకు నీటిలోకి దిగి ఆమె కూడా కొట్టుకుపోయింది. ఈ సమయంలో అక్కడే ఉన్న గణేష్ (30) వీళ్లను కాపాడేందుకు యత్నించి.. అతనూ వర్షపునీటిలో కొట్టుకుపోయాడు. ముగ్గురూ కొంత దూరం తర్వాత.. మురికినీటి కాలువలో చిక్కుకుని ఉండడంతో స్థానికులు వెలికి తీశారు. మున్నీ పెద్ద కొడుకు అనాథగా మిగిలిపోయాడు. పాపం మున్నీ.. దేవుడు ఆమెతో ఆడుకున్నాడు. ఆమె విధివంచితురాలు..అంటూ స్థానికులు రోధించారు. కాలువలో పడ్డ వాళ్లను కాపాడబోయి కాటికిపోయాడే.. అని అతడి తల్లిదండ్రులు రోధించడం అందరినీ కంట తడి పెట్టించింది.



భారీ వర్షానికి అదుపు తప్పి కాలువలో కొట్టుకుపోయి మృతి చెందిన తల్లి, కొడుకు



యామినిని మింగేసిన మురుగునీటి కాలువ

వర్షం మిగిల్చిన విధ్వంసం

● నలుగురిని మింగిన మురుగునీటి కాలువలు

● బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి మండిపల్లి

● మృతులు ఒక్కొక్కరికి రూ.6 లక్షల నష్టపరిహారం

రాయచోటి/రాయచోటి టౌన్/రాయచోటి నేతాజీ సర్కిల్/రామాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం గతంలో ఎన్నడూ చూడని విధ్వంసాన్ని మిగిల్చింది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని.. నలుగురి ప్రాణాలను మురికినీటి కాలువలు మింగేశాయి. మూడు కుటుంబాలు జీవితాంతం మాన్పుకోలేని గుండెకోతను మిగుల్చుకున్నాయి. అయితే బాధలో ఉన్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆసరాగా నిలబడింది. శుక్రవారం రాత్రే బాధితులకు అండగా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు నిలబడగా.. శనివారం ఉదయం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వయంగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతులు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు, మండిపల్లె నాగిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు తరపున మరో లక్ష కలిపి రూ.6 లక్షలు బాధితుల కుటుంబాలకు అందజేశారు. శుక్రవారం రాత్రి వర్షపునీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన వారి పరిస్థితి గమనిస్తే.. ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ.

బాధితులకు అండగా ప్రభుత్వం

శుక్రవారం రాత్రి జరిగిన దుర్ఘటనలో ప్రభుత్వం తక్షణమే బాధితులకు అండగా నిలిచింది. శుక్రవారం రాత్రే కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నరసింహకుమార్‌తో పాటు మునిసిపల్, అగ్నిమాపక శాఖల అధికారులు, సిబ్బంది బాధితులకు సహాయ చర్యలు చేపట్టారు. మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మేనల్లుడు మౌర్యలు సంఘటనా స్థలాలకు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఉదయం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్‌లతో కలిసి మృతుల కుటుంబ సభ్యులకు నష్టపరిహారాన్ని అందించారు. అనంతరం ఎస్ఎన్‌కాలనీ వెంకటేశ్వరా నగర్‌లో మృతుల ఇళ్లను పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం తర్వాత మృతుల స్వగ్రామాలకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.



యామిని మృతదేహాన్ని తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది



యామిని తండ్రికి ప్రభుత్వ సాయం అందచేస్తున్న మంత్రి మండిపల్లి, చిత్రంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్

రాయచోటిలో 14 సెం.మీ. వర్షపాతం నమోదు

● ప్రమాదానికి కారణమైన కాలువలు

రాయచోటి పట్టణంలో శుక్రవారం రాత్రి 145.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఒక్కసారిగా భారీ వర్షం ఒకటిన్నర గంటసేపు కురవడంతో రాయచోటి పట్టణంలో ఇరుకైన వీధుల్లో ఉన్న మురికి కాలువలు నీటి ఉధృతికి ఉప్పొంగాయి. ప్రజలకు, వాహనదారులకు ఎక్కడ కాలు పెట్టాలో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వర్షపు నీరు ఎస్ఎన్ కాలనీ వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో ఇరుకైన వీధుల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. కాలువలో పడిన తల్లి, కొడుకు షేక్ మున్నీ, ఇలియాస్ వీరి ఇంటి ముందు కాలువ ఉంది కాలువపై కొంత దూరం బండలు వేశారు. మిగిలినచోట బండలు లేవు. దీంతో పిల్లవాడు కాలువలో పడడం తల్లి రక్షించబోయి ఆమె పడిపోవడం వీరి ఇరువురిని రక్షించబోయిన గణేశ్ అనే వ్యక్తి ముగ్గురు కలిసి కొట్టుకుపోవడం క్షణాల్లో జరిగిపోయింది. రాయచోటి కొత్తపేట రామాపురం వీధి డైట్ హాస్టల్ డైట్ వద్ద పెద్ద మోరి వర్షానికి దెబ్బతిని రోడ్డు కోతకు గురైంది. పిల్లలను ఆటోలో తరలిస్తున్న సమయంలో ఒక్కసారిగా పిల్లలు దిగేయడంతో యామిని అనే చిన్నారి కాలువలోకి అడుగు పెట్టడంతో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కోతకు గురైన ప్రాంతంలో ఓ ద్విచక్రవాహనం కూడా ఇరుక్కొని ఉంది. ఇప్పటివరకు వరకు రాయచోటి చరిత్రలో ఇలాంటి వర్షం ఎప్పుడూ పడలేదని అంటున్నారు.



కొత్తపేట రామాలయం వీధిలో గండిపడిన కల్వర్టు వద్ద ఇరుక్కున్న ద్విచక్రవాహనం

సరస్వతి కరుణ కోసమెళ్తే.. గంగమ్మ మింగేసింది..

రాయచోటి మండలం గొర్లముదివీడు గ్రామం అరవవాండ్లపల్లెకు చెందిన రైతు రవీంద్రారెడ్డి, రమ దంపతుల ముగ్గురి సంతానంలో యామిని (8) ఒకరు. రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతోంది. తమ సొంత ఊరు రాయచోటికి దూరం కావడంతో పట్టణానికి సమీపంలో ఉన్న అబ్బవరంలో చిన్నాన్న ఇంట్లో ఉంటూ ఆటోలో స్కూల్‌కు వెళ్లి వస్తోంది. శుక్రవారం రాత్రి ఇంటికెళ్తున్న యామిని, మరికొందరు పిల్లలు ప్రయాణించే కె.రామాపురం నాలుగు కుళాయిల వద్ద ఆటో వర్షపునీటిలో చిక్కుకుంది. దీంతో ఆటోలోని పిల్లలందరూ కిందకు దిగారు. అయితే మురికినీటి కాలువపైన ఎటువంటి మూత లేకపోవడంతో కాలు పెట్టిన క్షణాల్లోనే యామిని నీటిలో కొట్టుకుపోయింది. తనతో పాటు ఆటోలో వచ్చిన వాళ్లు చూస్తుండగానే.. క్షణాల్లోనే ఇదంతా జరిగిపోయింది. దీంతో అక్కడున్న అందరూ.. అయ్యో.. సరస్వతి దేవి కరుణకోసమొస్తే... నిర్దాక్షిణ్యంగా గంగమ్మ మింగేసిందే.. అంటూ రోదించారు. కేవలం మునిసిపాల్టీ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న మురికినీటి కాలువపైన కనీసం ఎటువంటి మూత పెట్టలేదని ఆరోస్తున్నారు. మురికినీటి కాలువపైన మూత ఉండింటే. యామిని బతికి ఉండేదని వాపోతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు జిల్లా అధికారులు అందరూ యామిని ఆచూకీ కోసం గాలించారు. అయితే శనివారం ఉదయం సుమారు అర కిలోమీటరు దూరంలో మాండవ్య నదిలో పాతరాయచోటి సమీపంలో చిన్నారి మృతదేహం లభించింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని ప్రభుత్వ సుపత్రికి తరలించారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



కుషావతి నదిలో కొనసాగిన వరద ఉధృతి

● వరద నీటిలో విద్యార్థుల కష్టాలు

పెద్దమండ్యం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దమండంలో కుషావతి నది రెండవ రోజు కూడా ఉధృతంగా ప్రవహించింది. శనివారం ఉదయం 11 గంటల వరకు ప్రవాహం ఉధృతికి వాహనాలు, ప్రయాణికుల రాకపోకలు ఇబ్బందికరంగా సాగాయి. శుక్రవారం రాత్రి రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో శనివారం ఉదయం వరకు ఉధృతి సాగింది. కుషావతి నది నుంచి పాతచెరువు సప్లయ్ ఛానల్ లీకేజీలు, పూడికలతో చెరువుకు వర్షపునీరు అలస్యంగా వెళుతోంది. కలిచెర్ల పాపిరెడ్డిచెరువు వర్షపునీటితో మొరవపోతోంది. సి..గొల్లపల్లి, గ్రామ పంచాయతీ బండెపురెడ్డిగారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు భాగంలో గోడ కూలింది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాపేపల్లి పంచాయతీ గుడిసివారిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం వర్షపునీటితో ఉరుస్తున్నది. పెద్దమండ్య మండల తహసీల్దార్ కార్యాలయం కూడా గత కొన్నేళ్లుగా ఉరుస్తోంది. రికార్డుల గది మినహాయిస్తే అన్ని గదులు కారుతున్నాయి. పెద్దమండ్యం హైస్కూల్ ప్రహరీ కూలడానికి సిద్ధంగా ఉందని స్థానికులు తెలిపారు. తహసీల్దార్ తేజశ్వి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వరద పరిస్థితిని పర్యవేక్షించారు.



పెద్దమండ్యం కుషావతి నది ప్రవాహంలో విద్యార్థుల కష్టాలు

అప్రమత్తంగా ఉండండి

● జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం

● షెల్టర్, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది సిద్ధంగా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ మదనపల్లె, రాజంపేట సబ్‌కలెక్టర్లు, రాయచోటి ఆర్డీవో, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొంగి ఉన్న వాగులు, వంకలు దగ్గరికి ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, వర్షాల వల్ల తెగిపోయే రహదారులు, కల్వర్టుల దగ్గర హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను వెంటనే నిలిపివేయాలన్నారు. విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రిక్ వైర్లపై దృష్టి సారించాలన్నారు. వెల్ఫేర్ హాస్టళ్లు, పాఠశాలలపై దృష్టి సారించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున మంచినీటి సరఫరాపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాయచోటి , రాజంపేట, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలకు ఇబ్బంది కలుగకుండా షెల్టర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కేంద్రాల్లో అవసరమయ్యే ఆహారం, మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అంగన్వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. భారీ వర్షాలతో అనారోగ్య ఇబ్బందుల దృష్ట్యా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలను వినియోగించుకొని తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో రూ.63 లక్షల స్వాహా

● ఆర్టీసీ డీఎంతో సహా ఆరుగురి సస్పెన్షన్

రాజంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఆర్టీసీ డిపో పెట్రోల్ బంకులో అక్కడి సిబ్బంది రూ.63 లక్షలు స్వాహా చేసిన కేసులో డిపో మేనేజర్ రమణయ్యతో పాటు మరో ఐదుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య, అకౌంట్స్ విభాగంలో పనిచేసే డి.రామ్మోహన్, పీవీఎస్ నారాయణ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ధరనిబాయి, పెట్రోల్ బంకు పర్యవేక్షణ అధికారులు పీఆర్ నాయుడు, నరసారెడ్డిలను సస్పెండ్ చేశారు. ఈ సొమ్ము కాజేసిన సిబ్బంది చెల్లించకపోతే సంబంధిత సస్పెన్షన్ అధికారుల నుంచి రికవరీ చేసే అవకాశం ఉంది. గత ఏడాది డిసెంబరులో రాజంపేట ఆర్టీసీ డిపోలో నూతనంగా పెట్రోల్ బంకును మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. పెట్రోల్ బంకు ప్రారంభించిన తర్వాత 12 మంది కాంట్రాక్టు సిబ్బందిని పెట్రోల్ బంకు నిర్వహణ కోసం నియమించారు. ఓ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులే కాంట్రాక్టు సిబ్బందిగా ఇక్కడ చేరారు. వీరు షిఫ్ట్ పద్ధతిలో ఇక్కడ విధులు నిర్వహిస్తారు. అయితే కాంట్రాక్టు సిబ్బందిగా చేరినవారు ఎక్కువగా నగదు మొత్తాలను పెట్రోల్ పట్టిన వాహనదారుల ద్వారా తీసుకుని ఫోన్‌పే ద్వారా వచ్చినట్లు రిజిస్టర్‌లో నమోదు చేసి స్వాహా చేశారు. డిసెంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఈ తతంగం జరిగింది. సుమారు 9 నెలల కాలంలో ఫోన్‌పే ద్వారా బ్యాంకుల్లో జమ అయిన మొత్తం ఎంత, నగదు ద్వారా వచ్చిన మొత్తం ఎంత, మొత్తం జరిగిన పెట్రోల్ బంకుల లావాదేవీలు ఎంత వంటి వాటిని తనిఖీ చేయడంలో డీఎంతో సహా ఆర్టీసీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీంతో దొరికింది దొరికినట్లు కాంట్రాక్టు సిబ్బంది ఏకంగా రూ.63లక్షలు స్వాహా చేశారు. ఆగస్టులో ఈ విషయం కనుగొని కాంట్రాక్టు సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయట పడింది. స్వాహా చేసిన 63 లక్షల్లో కేవలం రూ.2 లక్షలు మాత్రమే చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించలేదు. ఈ విషయంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టి 63 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించారు. కడప ఆర్టీసీ డీపీటీవో రాజగోపాల్‌రెడ్డి శనివారం రాజంపేట ఆర్టీసీ డిపోకు చేరుకుని స్థానిక అధికారులతో సమావేశమై ఆర్టీసీ డీఎం రమణయ్యతో పాటు మరో ఐదుగురిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై సంబంధిత ఆర్టీసీ ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ మాధవీలతను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆర్టీసీ డీఎంతో సహా మరో ఐదుగురు సస్పెన్షన్‌కు గురైన మాట వాస్తవమేనని తెలిపారు.

ఆర్టీసీ పెట్రోల్ బంకుకు తాళం

పెట్రోల్ బంకులో 63 లక్షల రూపాయలు దుర్వినియోగం జరిగి డీఎంతో సహా మరో ఐదుగురిపై సస్పెన్షన్ వేటు వేయడంతో పెట్రోల్ బంకుకు శనివారం తాళం వేశారు. దీంతో పెట్రోల్ బంకులో పెట్రోల్ లావాదేవీలు నిలిచిపోయాయి. పట్టణ నడిబొడ్డున ఆర్టీసీ ముందు భాగంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఏర్పాటు చేసిన ఈ పెట్రోల్ బంకు వాహనదారులకు చాలా సులువుగా ఉండేది. పెట్రోల్ బంకు మూసివేయడంతో వాహనదారులు పెట్రోల్ పట్టుకోవడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది.



పెట్రోల్ బంకుకు తాళం



సస్పెన్షన్‌కు గురైన డిపో మేనేజర్ రమణయ్య

ఆ శాఖలో అధికారులే కరువు..!

- ఏడాదికాలంగా కనిపించని డీఆర్
- ఇది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ తీరు

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్నతాధికారులు కనుచూపు మేరా కనిపించడం లేదు. దాదాపు ఏడాది కాలంగా అన్నమయ్య జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇన్‌చార్జిలతోనే కొనసాగుతోంది. జిల్లాలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏదైనా ఇబ్బంది అనిపిస్తే వారు డిస్ట్రిక్ కార్యాలయానికి వచ్చి డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌తో చర్చించాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఇక్కడికి డీఆర్‌గా చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న డీఆర్‌కు ఇన్‌చార్జ్‌గా ఇచ్చారు. అయితే రాయచోటిలో కనిపించిన దాఖలాలే లేవు. డీఆర్ అందుబాటులో లేకపోవడం వల్ల జనరల్ పవర్ పట్టా ఉన్న ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండెక్స్ పీడీ కొట్టడంలో కూడా ఏదైనా పొరపాటు జరిగితే దానికి సమాధానం చెప్పే నాథుడు లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్ని రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆగిపోయిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి. ఇంత పెద్ద జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్లు భర్తీ చేయకపోవడంపై చాలా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ ఆ కార్యాలయంలో సిబ్బంది కనుచూపుమేరా కనిపించడం లేదు. ఇప్పటికైనా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వారు అన్నమయ్య జిల్లా డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌ను నియమిస్తే బాగుంటుందని ఇక్కడ ప్రజలు కోరుకుంటున్నారు.



డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, రాయచోటి

రెండు వారాలుగా ఆ సీటు ఖాళీ

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాదాపు రెండు వారాల క్రితం ఇక్కడున్న సబ్ రిజిస్ట్రార్ కడపకు బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆ సీటు ఖాళీగా ఉంది. ఆ స్థానానికి సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి ఇచ్చి కాలం నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామాల్లో ఉన్నటువంటి గ్రామ కంఠాలన్నీ కూడా రిజిస్ట్రేషన్లకు చేసి అందిన కాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఇంత జరుగుతున్నా రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న పెద్దలు ఏం చేస్తున్నారు, అసలు అన్నమయ్య జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ విధులు సక్రమంగా నిర్వహిస్తుందా లేదా అన్న సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఈ కార్యాలయంపై దృష్టి పెట్టి సీటు భర్తీ చేయాల్సిన అవరం ఎంతైనా ఉందని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.

జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వివరణ

ఈ విషయంపై డీఆర్ వెంకట్రమణ మూర్తిని వివరణ కోరగా... వారు ఇలా అన్నారు. నేను అక్కడికి రాలేను, ఈ రోజు నాకు కుప్పంలో క్యాంపు ఉంది. కాబట్టి నేను రాలేకపోతున్నాను అని అన్నారు.

నాడు-నేడు.. అసంపూర్తిగానే...

- ఆగిపోయిన పాఠశాల పక్కా భవనాలు
- రూ.3 కోట్ల నిధులు... పనులు అరకొరే...

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద 29 పాఠశాలల పక్కా భవనాలు 3 కోట్ల రూపాయలతో మంజూరయ్యాయి. అయితే వచ్చిన నిధులు వాడేసినా భవనాలు మాత్రం అసంతృప్తిగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా అసంతృప్తి భవనాలు పూర్తయ్యేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. 2022 సంవత్సరంలో మండలంలో 26 పాఠశాల భవనాలు, మూడు అంగన్వాడీ పక్కా భవనాలు మంజూరయ్యాయి. అయితే 29 పక్కా భవనాల్లో ఒక్క పాఠశాల కూడా పూర్తి కాలేదు. ఒక్కొక్క పాఠశాలకు 15 నుంచి 20 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. 2019 నాటికి పాఠశాల పక్కా భవనాలు కేవలం గోడలు, స్లాపు, పూతల వరకు పూర్తయి ఆగిపోయాయి. అప్పటి నుంచి ఇంతవరకు పట్టించుకోవడం లేదు. 3 కోట్ల రూపాయల్లో 2.90 కోట్లు నిధులు అయిపోయాయి. ఇంకా పనులు మాత్రం ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉన్నాయి. పందిళ్లపల్లె, కస్తూరిరాజుగారిపల్లె, లక్కిరెడ్డిపల్లె, కేజీబీవీ, దిన్నెపాడు, దేవళంపల్లి, కోనంపేట, దప్పేపల్లె గ్రామాల్లోని పాఠశాలల పక్కా భవనాలు కేవలం స్లాబు, పూతల వరకు వచ్చి ఆగిపోయాయి. ఆయా గ్రామాల్లో విద్యార్థులు పాత పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నారు. నాడు- నేడు రెండవ విడతలో మంజూరైన భవనాలు మాత్రం ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఉన్న నిధులు పూర్తయ్యాయి. భవనాలు మాత్రం అలాగే అసంతృప్తిగా దర్శనమిస్తున్నాయి. పందిళ్లపల్లె యూపీ స్కూల్‌లో పక్కా భవనం మంజూరైంది గానీ కేవలం స్లాబ్ వరకు వచ్చి పనులు ఆగిపోయాయి. ఆ పాఠశాల విద్యార్థులు చెట్ల కింద విద్యను అభ్యసిస్తున్నారు. దిన్నెపాడు పాఠశాలలో కడ్డీలు ఇంతవరకు అమర్చకుండా పాఠశాలలోనే తుప్పు పట్టిపోతున్నాయి. గొల్లపల్లి పాఠశాలలో కేవలం స్లాబ్ వేసి వదిలేశారు. విద్యార్థులు పాత భవనాల్లోనే విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల భవనాలు అసంతృప్తిగా ఉండడంతో చెట్ల కింద, బయట కూర్చుని విద్యను అభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైన ఆగిపోయిన పాఠశాల పక్కా భవనాలను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆగిపోయిన పక్కా భవనాల కోసం ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అసంతృప్తిగా ఉన్న పాఠశాల పక్కా భవనాలు పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



స్లాబ్ వరకు వచ్చి ఆగిపోయిన పందిళ్లపల్లె యూపీ పాఠశాల పక్కా భవనం



అసంపూర్తిగా ఉన్న గొల్లపల్లె ప్రాథమిక పాఠశాల

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ముగ్గురి ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

రాజంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న సౌత్ జోన్ మహిళా కబడ్డీ జట్టులో రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ విద్యార్థులు స్థానం సంపాదించారు. ఈ నెల 27 నుంచి 31 వరకు కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ మహిళా కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధిదదంచిన జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికలో అత్యంత ప్రతిభ కనబరచిన కె.అఖిలసాయి, కె.భవిత, ఎం.నిఖిత మరో ముగ్గురు విద్యార్థినులకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి, యూనివర్సిటీ వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, బి.నాగముని, జయరామిరెడ్డిలు మెమెంటోలు అందజేసి అభినందించారు.

కోడిపందాల స్థావరాలపై దాడి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలం పెద్దపల్లె గ్రామ పంచాయతీ మిట్టపల్లె సమీపంలోని రైల్వేబ్రిడ్జి సమీపంలోని కోడిపందేల స్థావరాలపై దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అరెస్ట్ అయిన వారినుంచి రూ.10,500 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మండలంలో మట్కా, జూదం, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పప్పు దినుసుల మోడల్ ప్రయోజనకరం



కందిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

రామాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండావాండ్లపల్లె సమీపంలో పప్పు దినుసుల మోడల్‌ని డీఏవో శివనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి మోడల్స్ రైతులకు లాభదాయకమని ఖర్చులు తగ్గి ఆదాయం వస్తుందని, తక్కువ వర్షపాతంలోనూ దిగుబడులు వస్తాయని తెలియజేశారు. ఈ మోడల్‌లో కందితో పాటు అనుములు, అలసందలు, ఉద్దులు, పెసర్లు, ఆముదం, గోరుచిక్కుడుతో పాటు బార్డర్ క్రాప్ వేశారని ఇలా వేసుకుంటే ఒక పంట పోయినా ఇంకొక పంటలో ఆదాయం వస్తుందని తెలిపారు. ఏవో నాగమణి మాట్లాడుతూ ఇలాంటి మోడల్స్ ఆదర్శంగా ఉండాలని తక్కువ ఖర్చుతో పండించుకోవచ్చునని తెలిపారు. రామాపురం మండలం ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ఈ ప్లాట్‌లో ఆరు రకాల పప్పు దినుసులు వేశారని బార్డర్ క్రాప్స్‌గ ఎరపంటలు వేశామని, ఇలా ప్రతి రైతు వేసుకోవాలని తెలిపారు. మామిడి తోట ఉన్న ప్రతి రైతు కూడా నవధాన్యాలు సాగు చేయాలని, అలా చేస్తే మామిడిలో దిగుబడి పెరగడమే కాకుండా పొలంలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు వెంకట్రామిరెడ్డి, సుధాకర్, చిట్లూరు క్యాడర్ వీఏఏ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిప్పిలి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మర్మతు పనులు శనివారం జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో కార్తీకమాసం ప్రారంభమవుతోందని, అయ్యప్ప మాలదారులు అధికంగా ఆలయానికి వస్తారని వారికి సౌకర్యం కల్పించడానికి ఆలయంలో మర్మతు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయాన్ని శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో గ్రాప్ టెంపుల్ ఈఓ రమణ, దేవాదాయశాఖ సిబ్బంది అంకన్న, రాజశేఖర్, బీజేపీ జర్మనీరాజు, తదిరతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచండి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని, ప్రజలందరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం సంబేపల్లెలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడో శనివారం రోజు గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అనే ఇతివృత్తంతో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని పాశ్చాత్య దేశాలు మన సంస్కృతి నుంచి పరిశుభ్రతను నేర్చుకొని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇంట్లో అవసరాలకు ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ కవర్లను వినియోగించాలని సూచించారు.

సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమం చివరిగా మానవహారంగా ఏర్పాటు చేసి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయ శాఖాధికారి లక్ష్మీపతి, జిల్లా పంచాయతీశాఖ అధికారి రాధమ్మ, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. శనివారం మదనపల్లె టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో డీఎస్పీ నిందితుల వివరాలను వెల్లడించారు. తనకల్లు మండలం టి. సదుం గ్రామం, నందివారిపల్లె వాసి రామన్న, భార్య రమణమ్మ, భార్య తమ్ముడు బి.కొత్తకోట మండలం, బావగారిపల్లె వాసి ఈశ్వర్ కలిసి మదనపల్లె పట్టణం, రామారావు కాలనీలో ఇల్లు బాడుగకు తీసుకుని నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవించేవారు. బావ రామన్న రోజూ మద్యం సేవిస్తూ కూలి పనులకు వెళ్లకుండా, అక్కను కొట్టి వేధింపులకు గురి చేస్తుండగా, వేధింపులు, అప్పుల బాధ భరించలేక తమ్ముడు ఈశ్వర్‌తో కలిసి భార్య రమ్మణమ్మ ఈ ఏడాది మార్చి 12వ తేదీ మధ్యాహ్నం రమణమ్మ ఆమె తమ్ముడు ఈశ్వర్ రుబ్బురోలు రాయితో రామన్న తలపై మోది హత్య చేశారు.

స్కూల్‌కు వెళ్లిన పిల్లలను ఇంటికి రావద్దని, బంధువుల ఇంటికి పంపి, అదేరోజు రాత్రి మృతదేహాన్ని గోనె సంచిలో వేసుకుని తమ స్కూటీపై తీసుకెళ్లి మదనపల్లెకు 45 కిలో మీటర్ల దూరంలో బి.కొత్తకోట, కస్తూర్బా పాఠశాల సమీపంలో హంద్రీనీవా కాలువ గట్టున పాతిపెట్టారు. మృతుడి అన్న లక్ష్మన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో అదృశ్యం కేసు నమోదు చేశారు. మృతుడి అన్న నిందితులు ఇద్దరిపై అనుమానం వ్యక్తం చేయడంతో శుక్రవారం మధ్యాహ్నం స్థానిక రామారావు కాలనీలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు వాస్తవాలు తెలిపారని, ఈ మేరకు బి.కొత్తకోట సమీపంలో మృతదేహాన్ని పూడ్చిపెట్టిన స్థలం వద్దకు కొత్తకోట తహసీల్దార్, మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహింతుల్లా నిందితులతో కలిసి వెళ్లి అక్కడ రామన్న మృతదేహం పూడ్చిన గోనె సంచిని తవ్వి పైకి తీసి రీపోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ ఎముకలు మాత్రమే లభించాయి. అవి ల్యాబ్‌కు పంపి నిందితులపై హత్య కేసు నమోదు చేశామని డీఎస్పీ పేర్కొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

దళితుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రతి నెలా సివిల్ రైట్స్ డే నిర్వహిస్తోందని కేవీపల్లె తహసీల్దారు నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. కేవీపల్లె మండలం నూతనకాల్వ పంచాయతీ దోర్నాలపల్లెలో శనివారం నేషనల్ సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా దోర్నాలపల్లె మాదిగపల్లెలో వెలుగు సంఘమిత్రగా పనిచేసిన వ్యక్తి సభ్యులు నిధులు గోల్‌మాల్ చేశాడని ఏపీ ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ ముల్లంగి చంద్రయ్య ఫిర్యాదు చేయగా వెంటనే అతన్ని తొలగించి వేరే వారిని నియమిస్తామని ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. వీధి లైట్లు సరిగ్గా వెలగడం లేదని, తమకు ఉపాధి ద్వారా పనులు కల్పించాలని, తమ ఇళ్లు ఉరుస్తున్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేయడంతో సంబంధిత శాఖల సిబ్బందిని ఆయా పనులు చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. నూతన కాల్వలోని ఓ హోటల్ నిర్వాహకులు కులవివక్ష పాటిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా అధికారులు హోటల్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా భవిష్యత్తుల్లో కులవివక్ష పాటిస్తే హోటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నరెడ్డప్ప, ఏపీఓ నాగరాజు, ఏపీఎం అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిబాబు, ఏపీ ఎంఆర్‌పీఎస్ నేతలు శ్రీనివాసులు, నాగేశ్వరయ్య, అశోక్ సామ్రాట్, ఆంజనేయులు పాల్గొన్నారు.



సివిల్ రైట్స్ డేలో అధికారులు, ప్రజాసంఘాల నేతలు

అనుమతి లేకుండా కలప రవాణా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా పచ్చని చెట్లు కూల్చాలన్నా, రవాణా చేయాలన్నా అటవీశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి, కాని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో ఎప్పుడో కూల్చేసిన మూడు చెట్లను ఇప్పుడు కొందరు అనుమతి లేకుండా పట్టపగలే రవాణా చేయడం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఆరునెలల కిందట మూడు చెట్లు నేలకూలాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వాస్పత్రి వర్గాలు వీటిని బహిరంగ వేలం వేసి కలపను విక్రయించాలి. కలప కొనుగోలు చేసిన వ్యక్తి అటవీశాఖ అనుమతి తీసుకుని రవాణా చేయాలి. కానీ ఇవేమీ జరగకనే శనివారం చెట్ల మొదళ్లను ముక్కలు చేసి కలపను ట్రాక్టర్లలో ఎత్తి రవాణా చేసేశారు. ఈ విషయమై మదనపల్లె ఎఫ్ఆర్ఓ ప్రసాదరావును వివరణ కోరగా, ప్రభుత్వాస్పత్రిలో కలప రవాణాను అనుమతి ఇవ్వలేదని, దీనిపై విచారించి అక్రమ రవాణా చేసివుంటే అటువంటి వ్యక్తులకు జరిమానా విధిస్తామన్నారు.



ట్రాక్టర్‌లోకి కలపను లోడ్ చేస్తున్న కూలీలు

ప్రిన్సిపాల్‌పై డీఈవో విచారణ



ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం

కలకడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలకడ ఆదర్శ పాఠశాల గత ప్రిన్సిపాల్, ప్రస్తుత ప్రిన్సిపాల్ మలాంషావలిపై శనివారం డీఈఓ సుబ్రహ్మణ్యం విచారణ చేపట్టారు. పాఠశాల పునఃప్రారంభమైన జూన్‌లో ఇక్కడ విధుల్లో ఉన్న మలాంషావలి పురుగులు పట్టిన బియ్యంతో అన్నం చేయించారని అప్పట్లో పాఠశాల కమిటీ ఛైర్మన్ రమేష్‌నాయుడు డీఈఓకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై జూన్ 20వ తేదీన మదనపల్లె డీవైఈఓ లోకేశ్వరరెడ్డి విచారణ జరిపి ప్రాథమిక నివేదిక అందజేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మలాంషావలి తీరుపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, గతంలో పని చేసిన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, మధ్యాహ్నభోజన నిర్వాహకులను డీఈఓ విచారించారు. సేకరించిన వాస్తవ పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని డీఈఓ తెలిపారు. అంతకుమునుపు ఆయన ఎండీఎంఏడీ రవికుమార్‌తో కలిపి మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు నరసింహారెడ్డి, ఎంఈఓ మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ గోవిందు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



వృద్ధురాలు కీరవాణి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో కీరవాణి(60) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం, సీటీఎం గ్రామం, పడమటివీధికి చెందిన మురళీ భార్య కీరవాణితో కలిసి బైక్ మీద సీటీఎం సమీపంలో తమకు ఉన్న కళ్యాణ మండపం వద్దకు వచ్చి శనివారం మధ్యాహ్నం ఇంటికి తిరుగు ప్రయాణంలో సీటీఎం క్రాస్ వద్ద మదనపల్లె ఆర్టీసీ అద్దె బస్సు ఓవర్‌టేక్ చేస్తూ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందగా మురళికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే మృతురాలి బంధువులు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ జానకీరాంను చితకబాదారు. కేసు ఏమీ వద్దని మృతదేహాన్ని అక్కడ నుంచి సీటీఎంకు తీసుకెళ్లారు. వెంటనే తాలుకా పోలీసులు రంగ ప్రవేశం చేసి మృతదేహాన్ని పరిశీలించి పోర్టుమార్టం నిమత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ అద్దె బస్సును తాలుకా స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి



ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ శనివారం రాయచోటి పట్టణంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట కార్మికుల కుటుంబాలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతులూరి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కాంట్రాక్ట్ కార్మికులన్నీ రెగ్యులర్ చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షల రూపాయలు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అది పరిష్కారం కాకపోతే అక్టోబర్ 6న తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేస్తామన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు, ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి హరి, ఏవీ రమణ, రెడ్డెప్ప, కిరణ్, శ్రీనివాసనాయుడు, మన్నాథ్‌రెడ్డి, రామాంజి, శ్రీనివాసులు, స్వాతి, సుజాత, సరస్వతి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాయచోటి, రాజంపేట డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, సురేంద్ర, మదనపల్లి, పీలేరు డివిజన్ నుంచి కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం ధర... దయనీయం

● గోడౌన్లలో మగ్గుతున్న నిల్వలు ● నిరాశపరుస్తున్న వడ్ల ధరలు ● ఆందోళనలో రైతన్నలు



రైతులు గోడౌన్‌లో నిలువ ఉంచిన ధాన్యం బస్తాలు

దువ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ధరలు రైతన్నలను తీవ్ర నిరాశపరుస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన వడ్లకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో సంబందిత రైతులు దిగాలు పడుతున్నారు. కిందటి సంవత్సరం డిసెంబరులో చేతికి వచ్చిన పంటకు సరైన ధర రాకపోవడంతో గోడౌన్లలో నిలవ ఉంచారు.

పేరుకుపోయిన నిల్వలతో ఆందోళన

నియోజవకర్గంలోని చాపాడు, దువ్వూరు, ఖాజీపేట మండలాల్లో కేసీ ఆయకట్టులో విస్తృతంగా వరి సాగవుతోంది. కిందటి సంవత్సరం 37 వేల ఎకరాల్లో వరిసాగైనట్లు వ్యవసాయశాఖ తెలుపుతోంది. ఈ సమయంలో ఆశించిన ధరలేకపోవడంతో రైతులు పండిన పంటను ఇళ్లలో, గోడౌన్లలో నిలువ ఉంచారు. మొత్తంగా 12 లక్షల బస్తాలు నిలువ ఉంటాయనేది ప్రాథమిక సమాచారం. వందల మంది రైతులు గిట్టుబాటు ధర కోసం నిరీక్షిస్తున్నారు.

పెరగని ధరలు - నిలువల్లో తరుగులు

రెండేళ్లుగా గోడౌన్లలో ధాన్యం నిలువలు పేరుకుపోతున్నాయి. ధర గిట్టుబాటు కాదని.. విక్రయించేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. గత డిసెంబరులో నిలువ ఉంచిన ధాన్యం రేటు పెరుగలేదు. అంతకుముందు సంవత్సరం ధాన్యానికి మాత్రం కొంత రేటు ఉంది. బస్తా రూ.2,300 ధర పలుకుతుండడంతో వాటికి సంబంధంచి విక్రయాలు కొనసాగుతున్నాయి. నిరుడు ధాన్యం బస్తా రూ.1900 మాత్రమే ధర ఉండడంతో విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. పంట చేతికందే సమయంలో ఇదే ధర ఉండేది. పాత ధాన్యానికి మాత్రం ధర విషయంలో కొంత మార్పు చోటు చేసుకుంది. నిలువ ఉంచిన ధాన్యానికి తరుగుతు పోతుందని.. ధరలు మాత్రం పెరగడం లేదని రైతులు వాపోతున్నారు. వడ్ల రకాలను బట్టి ధరల్లో మార్పు చోటు చేసుకుంటోంది.

అయోమయంలో రైతులు

వరిసాగు చేస్తున్న రైతుల్లో అయోమయం నెలకొంది. సాగు ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ధరలు పెరడంలేదని వీరి వాదన. సాగునీరు ముందుగానే రావడంతో నియోజకవర్గంలో మరో రెండు వేల ఎకరాల మేర ఈ ఏడు విస్తీర్ణం పెరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇదే వ్యాపారులు మార్కెట్‌లో విక్రయిస్తున్న బియ్యానికి మాత్రం ధర తగ్గడం లేదు. ఈ తతంగం వెనుక మతలబు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాము ఆరుగాలం కష్టించి పండిస్తే గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర రాక ధాన్యం విక్రయించలేదు



గత ఏడాది పండించిన ధాన్యానికి ఇప్పటికీ సరైన ధర రాలేదు. 13 ఎకరాల్లో వరి పంట సాగు చేసి.. వచ్చిన దిగుబడిని గోడౌన్‌లో అలాగే నిలువ ఉంచాను. సంచుల ఖర్చు, నిలువ చార్జీలు, తరుగుదల ఇలా లెక్కలు వేస్తే ధర గిట్టుబాటు కావడం లేదు. పండిన వెంటనే విక్రయించి ఉంటే బాగుండేది. పది నెలలుగా వడ్లను అలాగే నిలువ ఉంచాను.

- జయరామక్రిష్ణారెడ్డి, రైతు, ఎర్రబల్లి గ్రామం, దువ్వూరు మండలం

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపిక



కర్రసాము చేస్తున్న విద్యార్ధినులు

చెన్నూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల్లో భాగంగా మండలంలోని రామనపల్లె జడ్పీ ఉన్నత పాఠశా లలో జిల్లా స్థాయిలో నిర్వహించిన కత్తి సాము, కర్రసాము పోటీల్లో రామనపల్లె విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా అండర్ 19 బాల బాలికల పోటీల్లో కత్తిసాము, కర్రసాము పోటీల్లో పలు మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ మెంబరు గణేశ్‌బాబు, వసంత్, ఫాతిమా, ప్రశాంతి, నాగేశ్వర్‌రెడ్డితో పాటు సెక్రటరీ చంద్రమౌళిరాజు, చంద్రావతి పాల్గొన్నారు. కత్తిసాములో నందిని, నాగచైతన్య, సుశాంతి ఎంపిక కాగా, కర్రసాములో శిరీష, వరుణ్ ఎంపికయ్యారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

ఆటో డ్రైవర్ రసూల్‌పై త్రీటౌన్ సీఐ దాడి

● అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా



నిరసన వ్యక్తం చేసున్న ప్రజాసంఘాల నేతలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ యానాది కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ రసూల్‌పై త్రీ టౌన్ సీఐ వేణుగోపాల్ స్టేషన్లో దాడి చేసి బూతులు తిడుతూ కొట్టాడని ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ ఆరోపించారు. ఇందుకు నిరసనగా శనివారం స్థానిక పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ఆటో డ్రైవర్ కుమారుడు మహ్మద్ తన స్నేహితిరాలిని తీసుకు వెళ్లాడని ఆ అమ్మాయి తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ ఆటో డ్రైవర్ రసూల్‌ను స్టేషనుకు పిలిపించి నీచంగా మాట్లాడాడని, ప్రశ్నించి నందుకు కొట్టాడని ఆరోపించారు. ప్రేమికులు పారిపోతే వారు ఎక్కడున్నారో కనుక్కొని ఇంటికి తీసుకురావాలి కానీ పోలీసులు తల్లిదండ్రులను పోలీసు స్టేషన్లో అక్రమంగా నిర్బంధించి కొట్టడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, విరసం వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, మహిళా శక్తి కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



ద్విచక్ర వాహనాలు, దొంగను చూపుతున్న పోలీసులు

మైదుకూరు సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు తెలంగాణలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన దొంగను బ్రహ్మంగారిమఠం పోలీసులు అరెస్టు చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. కడప పట్టణం అశోక్ నగర్‌కు చెందిన గణేష్ బ్రహ్మంగారిమఠం వద్ద ఓ వ్యక్తిని బెదిరించి ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లడంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నిఘానేత్రాల ద్వారా గుర్తించి వాహనాల తనిఖీలో పట్టుకొని విచారించామన్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు తెలంగాణాలో కూడా వివిధ రకాల కేసులు ఉండడంతో అరెస్టు చేసి, రూ.5లక్షలు విలువ చేసే 10 ద్విచ క్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సీఐ శివశంకర్, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బందిని అభినందిస్తూ రివార్డులను అందించారు.

ముగ్గురు దొంగలు అరెస్టు

వేంపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం గండి రోడ్డులోని పిల్లస్వామి గుట్ట జగనన్న కాలనీలోని ఓ ఇంటిలో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను రెండురోజుల్లోనే వేంపల్లె పోలీసులు పట్టుకున్నారు. కాలనీలో నివాసముంటున్న నాగేంద్ర, వాణి దంపతులు పనులకు వెళ్లిన సమయంలో ఈనెల 18వ తేదీ ఇంట్లోకి ప్రవేశించి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ముగ్గురు దొంగతనం చేసినట్లు తేలింది. పులివెందుల డీఎస్పీ ఆధ్వర్యంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ ఖాదర్‌వలి మరో ఇద్దరు మైనర్లను సీఐ నరసింహులు, ఎస్ఐ తిరుపాల్‌నాయక్‌లు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 6.6తులాల బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లి పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై తిరుపతి నుంచి వస్తున్న లారీ కోడూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొనడంతో ఇరువురు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురిని స్థానికులు 108 వాహనంలో కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బొలేరో వాహనం డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని రూయా అసుపత్రికి తరలించారు. ప్రధాన రోడ్డుపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగింది. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధంచారు.

ఆర్టీపీపీలో ఆధిపత్యపోరు

● జేఏసీ వర్సెస్ తెలుగునాడు కార్మిక సంఘాల మధ్య ఘర్షణ ● ఇద్దరికి స్వల్ప గాయాలు





ఆర్టీపీపీలో రిలే దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, మెయిన్‌గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న తెలుగునాడు కార్మిక సంఘం నేతలు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా పోరాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన కార్మిక సంఘాలు ఆర్టీపీపీలో ఆధిపత్యపోరు ప్రదర్శిస్తూ ఘర్షణకు పాల్పతుడుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఆర్టీపీపీలో ఉద్యోగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ 15వ తేదీ నుంచి దశలవారీగా ఆందోళన చేస్తోంది. అందులో భాగంగా శనివారం రిలే దీక్షలు చేపట్టింది. అయితే అదే సమయంలో తెలుగునాడు కార్మిక సంఘం కొన్ని కార్మిక సంఘాల మద్దతుతో గేటు ఎదుట ధర్నా చేస్తు న్నారు. జేఏసీ నాయకులు ప్లాంటు లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఆందోళన చేస్తుండగా లోపలికి ఎలా వెళ్తారంటూ జేఏసీ నాయకులను తెలుగునాడు అడ్డుకుంది. దీంతో అక్కడ తోపులాట జరిగి తెలుగునాడు కార్మిక సంఘం నాయకులు పులి సుధాకర్‌రెడ్డి, మనోహర్‌కు గాయాలయ్యాయి. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెల కొంది. ఇది చిలికిచిలికి గాలివానలా రాజకీయ జోక్యం వరకు వెళ్లింది. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు పోలీసుస్టేషన్‌కు పిలిపించి పంచాయితీ చేశారు. ఇందులో బాగంగా జేఏసీ నాయకులు జగదీష్ తదితరులు మెయిన్‌గేటు దగ్గరలో ఉన్న జేఏసీ శిబిరంలో మాట్లాడుతూ జాయింట్ యాక్షన్ కమిటీ తరుపున ఏదైనా పొరపాటు జరిగివుంటే దానికి పూర్తి బాధ్యతగా క్షమాపణ చెబుతున్నట్లు బహిరంగంగా పేర్కొన్నారు. పులిసుధాకర్‌రెడ్డి, మనోహర్ టీఎన్‌టీ యూసీ ఇతరులెవరైనా సరే ఈ పోరాటం ఆగేందుకు ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కారం చేయాలని.. అప్పుడు మేమం దరం మీవెంట నడుస్తామని ప్రకటించారు. గత ఐదేళ్లుగా ఈ సమస్యలు పరిష్కరించలేదని, ఈఐదేళ్లలో కూడా తమకు న్యాయం జరిగేది లేదని కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు గుసగుసలాడు కోవడం కొసమెరుపు. నాయకులు ఆదిపత్యపోరు, ఉనికి కాపాడు కోవడం తప్ప తమకు ఒరింగిందేమిలేదని చెవులుకొరుక్కుంటున్నా రు.

రేపటి నుంచి దసరా సెలవులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గవర్నమెంట్, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలకు 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు డీవో షంషుద్దీన్ శనివారం తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని, ఉత్తర్వులు ఉల్లంఘిస్తే యాజ మాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం



మిల్లెట్స్ మేళాను సందర్శిస్తున్న అధికారులు

సీకేదిన్నె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ తెలిపారు. కృషి విజ్ఞానకేంద్రం ఊటుకూరులో శనివారం ఘనంగా మిల్లెట్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి, కొర్ర, సజ్జ, జొన్నలు వంటి చిరుధాన్యాలపై మక్కువ పెంచుకుని వాటిని ఇష్టంగా తిని ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో సాగు చేసి అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్నారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం ద్వారా చిరుధాన్యాల ఆవశ్యకతను ప్రపంచం మొత్తం గుర్తించిందన్నారు.

మెప్మా పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూచిరుధాన్యాల వ్యాపారవేత్తలను ప్రోత్సహించి ప్రాసెసింగ్ యూనిట్లను రైతు సోదరులు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తుందన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాలకు ప్రధాన సమస్య యాంత్రీకరణ అని, దానిని అధిగమించి చిరుధాన్యాల్లో ప్రాసెసింగ్ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రెడ్డికుమార్, శారద, శాంతిప్రియ చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త బాలకృష్ణ, ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ, శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సురేష్‌కుమార్‌రెడ్డి, మానస, రైతులు, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు మిల్లెట్‌మేళాను సందర్శించారు.

తప్పిపోయిన పిల్లలు.. తల్లిదండ్రుల చెంతకు!

● కడప తాలూకా పోలీసులకు ప్రజల మన్ననలు



బాలురను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కడప క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఇద్దరు బాలురను కేవలం గంటల్లోనే గుర్తించి తిరిగి వారిని వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చి ప్రజల మన్ననలు పొందారు. కడప తాలుకా సీఐ టి.రెడ్డప్ప వివరాల మేరకు.. నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న సాయిబాబా స్కూలులో 8వతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు టి.కౌశిక్ కుమార్‌రెడ్డి, ఎస్.ప్రణయ సాయిరెడ్డిలు ఇద్దరూ స్నేహితులు. అయితే శుక్రవారం మధ్యాహ్నం 1.30గంలకు స్కూలు నుంచి కనిపించకుండా వెళ్లిపోయారు. వారి కోసం ఎంత వెదికినా ఆచూకీ లభ్యం కాక తల్లిదండ్రులు, స్కూలు యాజమాన్యం శుక్రవారం సాయంత్రం తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్య వేక్షణలో పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. బృందాలుగా విడిపోయి నగరం నలుమూలలా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ టీవీల రికార్డులు పరిశీలించి.. గంటల వ్యవధిలోనే ఆ బాలురు తిరు పతి రైల్వేస్టేషనులో ఉన్నట్లు గుర్తించారు. పోలీసు సిబ్బందిని తక్ష ణమే తిరుపతి రైల్వేస్టేషనుకు పంపి విద్యార్థులను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈసందర్భంగా కడప తాలుకా పోలీసు యంత్రాంగానికి బాలుర తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపా రు. కాగా, తప్పిపోయిన బాలురను అతికొద్దిగంటల్లోనే గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన తాలుకా సీఐ రెడ్డప్ప, ఎస్ఐ తాయార్ హుసేన్, సిబ్బందిని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాధ్ అభినందించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా విద్యాసంస్థలు విద్యార్థుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు.

శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరం



పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను వివరిస్తున్న డాక్టర్ సాయిశ్రీనివాస్

పులివెందుల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలు, పండ్లు పండిస్తున్న రైతులకు ఏర్పాటు చేస్తున్న శిక్షణా కార్యక్ర మాలు ఎంతో ఉపయోగకరమని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ అన్నారు. శని వారం ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల బెంగుళూరు ఐఐ పీఎం, ఫ్రెండ్స్ ఆఫ్ ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ సొసైటీ సంయు క్తంగా చిరుధాన్యాల విలువ జోడింపు, మార్కెటింగ్ మరియు బ్రాండింగ్ అనే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా డీఎస్ మాధవ మాట్లాడుతూ పండ్లు, చిరుధాన్యాలు ప్రాసెసింగ్ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరమన్నారు. జ్యూస్ బాటిలింగ్, ఆటోమేటిక్ యంత్రా లు, చిరుధాన్యాల శుభ్ర పరిచే యంత్రాలు, చిరుధాన్యాల నుంచి రవ్వ, పిండి చేసే యంత్రాలను ఉపయోగించి ఆహార పదార్థాలు తయారు చేసే ప్రక్రియను శిక్షణా కార్యక్రమానికి వచ్చిన రైతు లకు ప్రత్యక్షంగా వివరించారు. అలాగే కళాశాల అధ్యాపకులు ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్ కళాశాలలోఉన్న లైవ్లీ హుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఉన్న యంత్రాల పని తీరును వివరిస్తూ సాంకేతిక సమాచారాన్ని రైతు లకు అందిం చారు. పండ్లతో కస్టర్డ్ డ్రింక్, జల్ జీరా డ్రింక్, జామ్, జెల్లీ, రక రకాల చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే విధాన ప్రక్రియలో కూడా స్వయంగా రైతులు పాల్గొన్నారు. కార్య క్రమంలో ఐఐపీఎం ప్రతినిధి డాక్టర్ నబీరసూల్, కళాశాల అధ్యా పకులు డాక్టర్ రాజేష్, డాక్టర్ జాకీర్ బాష, పీడీ డాక్టర్ రాజశేఖ ర్, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల సొసైటీ సభ్యులు, ఎఫ్‌పీఓలకు చెందిన రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఫస్ట్, సెకండ్, థర్డ్ బీటెక్ కోర్సులకు సంబంధించి రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మేనెలలో బీటెక్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, ఎంఎంటీ, ఎంఈ విభాగాల ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. పరీక్షల విభాగాన్ని, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రశంసించారు. రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపాల్ బి.జయరామిరెడ్డి, ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, పరీక్షల కంట్రోలర్ ప్రొఫెసర్ కృష్ణారావు, అసిస్టెంట్ కంట్రోలర్స్ సుబోస్‌చంద్ర, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

● 19 మంది ఎంపిక



విద్యార్థులకు నియామకపత్రాలు అందిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన క్యూస్పైడర్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ డ్రైవ్‌లో ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంఎస్సీ డేటా సైన్స్ విభాగాల విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ప్రతిభావంతులను కంపెనీ ప్రతినిధులు ఐశ్వర్య, అరు ణిమలు ఎంపిక చేశారు. 19 మంది విద్యార్థులు ప్రోగ్రామింగ్ డెవలపర్ ఉద్యోగాలను సాధించారు. ఎంపికైన వారికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు నియామకపత్రాలను అందించారు. పీజీ చదువుతూనే రూ.3లక్షల నుంచి రూ.9లక్షల వరకు వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందడం విశేషమని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ కె.లలిత, డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

వేంపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు వేతనాల కోసం ధర్నా చేపట్టారు. శనివారం కార్యాలయం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఏం తిని బతకాలి అంటూ ఆక్రోశం వెలిబుచ్చారు. మొన్నటి వరకు ఈఓ లేనందున ఇవ్వలేకపోతున్నామంటూ చెప్పుకొచ్చిన అధికారులు ప్రస్తుతం ఈఓ ఉన్నప్పటికీ ఎందుకు ఇవ్వడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనే యులు, చల్లా బాలాజీ తదితరులు పారిశుధ్య కార్మికులకు సంఘీభావంగా ఆందోళనలో పాల్గొన్నా రు. కాగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓ నాగభూష ణంరెడ్డి తెలిపారు.

'పోతుగుంట'కు సన్మానం



పోతుగుంట రమేష్‌నాయుడును సత్కరిస్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్

రాజంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్‌గా నియమితులైన పోతుగుంట రమేష్‌నాయుడును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్ ఘనంగా సత్కరించారు. శనివారం ఆయన విశాఖపట్టణానికి వెళ్లి మాదవ్‌ను కలిసి కతృజ్ఞతలు తెలియజేశారు. విఘ్నేశ్వర ప్రతిమను మెమెంటోగా అందజేశారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్ తదితరులు రమేష్‌నాయుడును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను శ్రీశైలం ఆలయం చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్, ఇతర నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మండల అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

● ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్..



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అధికారులతో పాటు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోవైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. ప్రధాన సమస్యలపై ఒక ప్రణాళిక రూపొందించాలని, నాయకులు తమ సూచనలు సలహాలు ఇస్తే వాటిపై అసెంబ్లీలో చర్చిస్తామని తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల ఒక ప్రభుత్వ పాఠశాల తనిఖీ చేసినప్పుడు ఉపాధ్యాయులు లేని కారణంగా పాఠశాల మూసివేయడం జరిగిందని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా మండల విద్యాశాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు వారి చదువుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈ సమస్యపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చర్చించి త్వరలోనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులు ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ఒక వినూత్న ఆలోచనను ఆయన సమావేశంలో చర్చించారు. గ్రామల్లో ఖాళీగా ఉన్న యువతతో విద్యార్థులకు క్లాసులు చెప్పించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు, అవసరమైతే వారికి తన సొంత నిధులతో జీతం ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగిరెడ్డి, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ..

పట్టణంలో పాతబజార్ వీధిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామన్నారు. పౌరసరఫరా సేవలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా నూతన స్మార్ట్ కార్డులను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఉర్లగడ్డపోడు గ్రామంలో అడవి జంతువుల దాడిలో పంట నష్టపోయిన రైతులు నరసమ్మకు రూ.1.50 లక్షలు, పార్వతమ్మకు రూ.1.41 లక్షలు, సరస్వతికి రూ.1.47 లక్షల రూపాయలు చొప్పున నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. సీఎస్‌డీటీ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ నాయకులు పోతురాజు నవీన్, నార్జల హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రతి ఒక్కరూ పొందాలి



స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శనివారం మండల పరిధిలోని పెద్దివీడు, పుత్తావాండ్లపల్లె, తాటికుంటపల్లెల్లో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్డుదారునికి రేషన్ డీలర్లు, సచివాలయ సిబ్బంది ఈ స్మార్ట్ కార్డులను తొందరగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాను గోపాల్‌రాజు, తహసీల్దార్ ఖాజాబీ, ఆయా శాఖల అధికారులు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'యూటీఎఫ్ రణభేరి'ని జయప్రదం చేయండి

గాలివీడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) ఈ నెల 25వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న యూటీఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పాలకుల తప్పిదాలే నలుగురి మృతికి కారణం: సీపీఎం



రాయచోటిలో డ్రైనేజీని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలకుల తప్పిదాలే నలుగురి మృతికి కారణమయ్యాయని, నాణ్యతలేని సీసీ రోడ్డు, చిన్న చిన్న డ్రైనేజీల నిర్మాణం తోనే ఇళ్లలోకి వరద నీరు వచ్చిందని సీపీ ఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. శనివారం రాయచోటి పట్టణంలోని వరద ప్రాంతాల్లో సీపీఎం నాయకు లు పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాలువల మీద అక్రమ కట్టడాలే ఈ సంఘటన కు కారణమన్నారు. నాలుగు కొళాయిలు, డైట్ హాస్టల్ గేటు వద్ద ఏర్పడిన పెద్ద గుంతను అధికారులు సందర్శించినా, ఇంటి కింది భాగం కొట్టుకు పోయినా ఇళ్లు ఖాళీ చేయించలేదని తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇష్టారాజ్యంగా మట్టిపై సిమెంటు వేసి నాణ్యత లేకుండా రోడ్లు వేశారని, చిన్నచిన్న డ్రైనేజీ కాలువలు నిర్మించడంతో వర్షం నీరు ఇండ్లలోకి వచ్చిందన్నారు. గత కలెక్టర్ భారీ వర్షాలకు సెలవులు ప్రకటించి ప్రాణనష్టం జరగకుండా చేశారని, కానీ నేడు భారీ వర్షం ఉంటే జిల్లా అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజానీకాన్ని అప్రమత్తం చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఎస్ఎన్ కాలనీలో ముగ్గురి మరణానికి కారణం డ్రైన్స్ మీద సీలింగ్ వేయకపోవడమేనన్నారు. అకాల మరణం చెందిన వారికి ప్రభుత్వ సాయం రూ.5 నుంచి రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, మంత్రి జోక్యం చేసుకుని అక్రమ కట్టడాల మీద, కబ్జాదారుల మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సీపీఎం కమిటీ సభ్యులు రామాంజులు, శాఖా కార్యదర్శి మాధవయ్య, స్థానికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా డ్రైనేజీలో కొట్టుకుపోయి మృత్యువాత పడినవారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి పీ. మహేశ్, రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీని గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేస్తున్నామని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్ద బహిరంగ సభ పెట్టి రూ.3 వేల కోట్ల నిధులు ప్రకటించారన్నారు. అయితే, ఆ పనులు ఎక్కడ జరిగాయో అర్థం కావడం లేదన్నారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయకపోవడం, రోడ్లు వెడల్పు చేయకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా వీధులన్నీ మురుగుకుంటల్లా మారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అనేక దఫాలుగా పోరాటాలు నిర్వహించినా పాలకులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం గడుస్తున్నా మున్సిపాలిటీలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా అండర్ డ్రైనేజీ వ్యవస్థతో పాటు రోడ్లు వెడల్పు చేయడంతోపాటు, మాండవ్యనది ఆక్రమణలు తొలగించి రక్షణ గోడ నిర్మించాలన్నారు. తక్షణం మృతుల కుటుంబాలను ఆదుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆంగ్ల భాషాభివృద్ధి కోసం క్విజ్ పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటి - నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆంగ్ల భాషాభివృద్ధి కోసం క్విజ్ పోటీలు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆంగ్ల ఉపాధ్యాయులు విజయ భాస్కర్, దేవప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు ఆంగ్లంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు మరమ్మతు పనులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నయంత్రాలు

సుండుపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన పించా- సుండుపల్లె ప్రధాన రహదారి మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. శుక్ర వారం తెల్లవారుజామున అ య్యవారి చెరువు తెగి చెరుకువాండ్లపల్లె సమీపంలో ప్రధాన రహదారి కొట్టుకు పోయింది. అదే రోజు ఆర్అండ్‌బీ అధికారులు, రాజంపేట అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి జగన్ మోహన్‌రాజు పరిశీలించి రాకపోకలకు అంతరాయం లేకుండా మరమ్మతు పనులు ప్రారంభించారు. శనివారం సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయని ఆర్అండ్‌బీ ఏఈ కుమార్ బాబు తెలిపారు. సుమారు 40 పల్లెల ప్రజలు మండల కేంద్రానికి వచ్చేం దుకు ఇబ్బందులు పడుతున్నారన్న ఉద్దేశంతో త్వరగా పనులు పూర్తి చేసేందుకు పని చేస్తున్నామన్నారు. వర్షం రాకపోతే ఆదివారం సాయంత్రానికి పనులు పూర్తి చేస్తామని తెలియజేశారు. కోతలకు గురైన చోట మట్టి తోలి పనులు పూర్తి చేశాం పైపులు దింపి, రాకపోక లు పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఉత్సాహంగా.. క్రీడా పోటీలు



విజేతలను అభినందిస్తున్న ముఖ్య అతిథులు

నందలూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ గౌరి ఆధ్వ ర్యంలో శని వారం షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్ త్రో, షటిల్ లలో 14, 17 సంవత్సరాల లోపు బాల బాలికలు రెం డేసి జట్లుగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. పోటీల్లో విజేతలను ముఖ్య అతిథులు అభినందించారు. పరుగు పోటీ, జావెలిన్ త్రో, ఖోఖో తదితర పోటీలను దసరా సెలవుల అనంతరం నిర్వహి స్తామని కోఆర్డినేటర్ గౌరి ప్రకటించారు. ప్రధా నోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ, డిప్యూటీ డీఈవో నాగయ్య, ఎంఈవో అనంతకృష్ణ, పాటూరు హెచ్ఎం మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రెడ్డయ్య తెలిపారు. శనివారం ముక్కావారిపల్లె ఏపీఆర్ స్కూల్లో, ఓబులవారిపల్లె జడ్పీ హై స్కూల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిం చినట్లు వివరించారు.

ఒంటిమిట్ట పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

● అన్ని సేవలకు ఆశా కార్యకర్తలే..



ఓపీ నమోదు చేసుకున్న ఆశా కార్యకర్త

ఒంటిమిట్ట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :ఒంటిమిట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆశ కార్యకర్తలే అన్నీ అయ్యారు. జరిగింది. వివిధ సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన రోగులందరికీ వారే సేవలందించారు. స్టాఫ్ నర్సు నిర్వహించాల్సిన ఓపీ నమోదు విధులను ఆశా కార్యకర్త నిర్వహించారు. ఈ విషయమై మండల వైద్యాధికారి భావనను వివరణ అడుగ్గా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్‌నర్సు పోస్టులు ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారన్నారు. సీహెచ్‌వో, పీహెచ్ఎన్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయన్నారు. సిబ్బంది కొరత కారణంగా, ఆశా కార్యకర్తలతో సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

రాజంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలంలోని కూచివారిపల్లె, మిట్టమీదపల్లె, కొల్లావారిపల్లెలో చైల్డ్ ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. రాజంపేట ఐసీటీసీ కౌన్సిలర్ పి.వెంకటసుబ్బయ్య, చైల్డ్ ఫౌండేషన్ ఇండియా అధికారి అల్లావల్లి, సీడీఎస్ అదికారులు శివయ్య, సుబ్బారెడ్డి, కాంచన, ఓబులయ్యతో పాటు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌సీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Palagiri Imam Sab** S/o **P. Baba Sab** R/o D.No. 75/18-19, Dudekulapalli, Galiveedu Road, Rayachoty Town, Post, Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after Five days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY:**-Annamayya Dist. erstwhile YSR Kadapa District, Rayachoty sub. Reg. Dist. Rayachoty Mandal at Rayachoty Village Polam in **Sy. No. 462,** an extent of **210 Square Yards** out of Ac. 0-09 cents out of Ac. 1-00 cents with house bearing D.No. 75/18-19 at Dudekulapalli Street, in ward No. 75 **Bounded by:** East – 10 feets width Rasta, West - Site of V. Kamal Sab, North - Rasta, South - Site of Palagiri Raja **Measuring :** East - West (Length) = 45 feets, North - South (Width) = 42 feets. R.C.C. Building with doors, door frames, windows, almaras and all fittings attached to the building with easementary right. (Property covered in registered gift deed No. 2573/2025 (S.R.O. Rayachoty)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Smt. Shaik Pyarijan** W/o **Shaik Rowfa,** R/o D.No. 1-162, Settipalli Village Post, Sambepalli Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after Five days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY:**-Annamayya Dist. erstwhile YSR Kadapa District, T.Sundupalli Sub. Reg. Dist. Sambepalli Mandal at Settipalli Village fields in **Sy. No. 1791,** an extent of **229.9 Square Yards** or Ac. 0-04 1/4 cents out of Ac. 0-31 cents out of Ac. 2-34 cents house bearing D.No. 1-162 with assessment No. 132 **Bounded by:** East – Donka, West - Road, North - Site of Syed Jabivul, South - Site of Syed Basha & Others. R.C.C. Building with doors, door frames, windows, almaras and all fittings attached to the building with easementary right. (Property covered in registered Sale deed No. 222/2015 (S.R.O. T. Sundupalli)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Kethamreddy Venkatramana Reddy** S/o **K. Sivarami Reddy** R/o Kethamreddygaripalli, H/o Motakatla Village, Post, Sambepalli Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after Five days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY:**-Annamayya Dist. erstwhile YSR Kadapa District, Rayachoty sub. Reg. Dist. Rayachoty Mandal at Rayachoty Municipality & Village Polam in Sy. No. 867 and extent of **112 Square Yards** vacant house site (Plots No. 39,40) out of Ac. 19-84 cents **Bounded by:** East – Site of Chakka Dhana Lakshmi, West - Site of V.Subba Reddy, North - Site of Khasim, South - 12 Feets width Rasta **Measuring :** East - West = 24 feets, North - South = 42 feets. (Property covered in registered Sale deed No. 5630/2006 (S.R.O. Rayachoty)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Smt. Devapatla Vijayakumari** W/o **Devapatla Nagarjuna Reddy,** R/o D.No. 2-187, Janardhanareddy Nagar, T. Sundupalli Town, Post, Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after Five days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY:**-Annamayya Dist. erstwhile YSR Kadapa District, T.Sundupalli Sub. Reg. Dist. T.Sundupalli Mandal at T. Sundupalli Village fields in **Item No.1 :** Sy.No. 2044/1, an an extent of Ac. 3.94 cents, Sy.No. 2044/2 an extent of Ac. 1-56 cents out of it an extent of 111.11 square yards vacant house site with Plot No. 110, **Bounded by :** East-Site in Plot No. 113, West-22 feets width road, North-Site in Plot No. 111 (below Item No.2), South - Site in Plot No. 109, Measurements : East-West (length) = 50 feets, North-South (Width) = 20 feets, **Item No.2 :** Sy.No. 2044/1, an an extent of Ac. 3.94 cents, Sy.No. 2044/2 an extent of Ac. 1-56 cents out of it an extent of 127.77 square yards vacant house site with Plot No. 111, **Bounded by :** East-Site in Plot No. 112, West-22 feets width road, North- 20 feets width road, South - Site in Plot No. 110 (above Item No.1), Measurements : East-West (length) = 50 feets, North-South (Width) = 20 feets,R.C.C. (Property covered in registered Sale deed No. 671/2015 (S.R.O. T. Sundupalli)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Smt. Pathan Salma Bee** W/o **Pathan Ibrahim Khan, Pathan Maruf Khan S/o Late Pathan Ibrahim Khan, Pathan Liyakhat Ali Khan S/o Late Pathan Ibrahim Khan,** R/o D.No. 13/159, Mohammedpura street, Rayachoty Town, Post, Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after Five days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY:**-Annamayya Dist. erstwhile YSR Kadapa District, Rayachoty sub. Reg. Dist. Rayachoty Mandal at Rayachoty Municipality at Masapeta Village Fields in **Sy. No. 1,** an extent of **112 Square Yards** vacant house site (Plots No. 34, 40) with house bearing D.No. 13/159 in Ward No. 13 at Mohhamadpura street, **Bounded by:** East – Site of Chakka Dhana Lakshmi, West - Site of V.Subba Reddy, North - Site of Khasim, South - 12 Feets width Rasta **Measuring :** East - West = 24 feets, North - South = 42 feets. (Property covered in registered sale deed No. 3146/1993 (S.R.O. Rayachoty)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి



మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర పేరిట రాజంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, వైద్యశాఖ, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఎక్సైజ్ సీఐ మల్లిక తదితరులు పాల్గొన్నారు. మొక్కలు నాటారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పిలుపు మేరకు ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్లాస్టిక్ రహిత వస్తువులను వాడాలని, మొక్కలు నాటాలని తెలిపారు.

నందలూరు : ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, గ్రీన్‌డే సందర్భంగా నారాయణరాజుపేట, ఎర్రచెరువుకట్ట రహదారి పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఒక్కొక్కరు ఒక మొక్క నాటడం ద్వారా మానవాళికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో సురేష్, సిబ్బంది సుధీర్, శివ, గ్రామస్థులు మట్టి బాబు, తుమ్మది శివకుమార్, ఉపాదిహామీ, సిబ్బంది పాల్గొన్నారు.

పేస్కేల్ అమలు చేయాలని వీఆర్ఏల ర్యాలీ



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు రాజంపేటలో శనివారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, గౌరవాధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, రాజంపేట సీఐటీయూ ఉపాధ్యక్షుడు రవికుమార్, తదితరులు రాజంపేట ఎన్జీవో భవనం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించి వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా గురజాడ జయంతి



పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గురజాడ జయంతి సందర్భంగా శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా ప్రధాన కార్య దర్శి బాబాఫకృద్దీన్ మాట్లా డుతూ గురజాడ కేవలం కవి మాత్రమే కాదని, సంఘ సంస్కర్త, దేశభక్తి కలిగిన అభ్యుదయ కవి అని తెలిపారు. ఆయన కన్యాశుల్కం నాటకం ద్వారా తెలుగు నాటక రంగానికి కొత్త దిశ చూపించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం , వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, జేవీవీ నాయకులు రవీంద్రారెడ్డి, అంజనేయులు, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఐటీఐతో మెండుగా ఉద్యోగ అవకాశాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రమణరాజు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐతో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ రాజు తెలిపారు. శనివారం ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కంపెనీలో ఐటీఐ నిపుణుల అవసరం ఎక్కువగా ఉందన్నారు. అనంతరం ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ శ్రీహరికోట, డిక్సన్, షిర్డీసాయి ఎలక్ట్రికల్ సంస్థల్లో మనవారు ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆదిప్రసాద్, అధ్యాపకులు గంగయ్య, వెంకటేశ్, ఉషా, సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు దసరా వేడుకలు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాజు విద్యా సంస్థల్లో శనివారం ముందస్తు దసరా ఉత్సవాలను నిర్వహించారు.పాఠశాల సీఈవో రఘురామ రాజు, హెచ్ఎంలు మోహన్‌రెడ్డి, జి.బాలగంగాధర్‌నాయుడు దసరా ఉత్సవాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమను పట్టు వస్త్రాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పూజలు నిర్వహించారు. విద్యార్థినులు అమ్మవారి వేషధారణలో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జిలు హబీబ్, గుర్రంకొండ కృష్ణవేణి, ఉపాధ్యాయులు నాగజ్యోతి, సోని, రాజేశ్వరి, నాగమణి, మాలతి, సుధారాణి, శశికళ, శిరీషా, జయప్రకాష్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో చెరువుకు చేరిన నీరు



ఒంటిమిట్ట చెరువుకు చేరిన నీరు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలోని అతి పెద్ద చెరువుల్లో ఒక్కటైన ఒంటిమిట్ట చెరువుకు నీరు చేరింది. మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడం, చెరువుకు నీరు రావడంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఇప్పటి వరకు రైతులు సాగును ప్రారంభించలేదు. ప్రస్తుతం చెరువుకు కొద్దిపాటి నీరు రావడంతో వ్యవసాయ పనులు ప్రారంభిస్తామని రైతులు తెలిపారు. మరో మూడు రోజులు భారీ వర్షం కురిస్తే చెరువు నిండుతుందని రైతులు చెబుతున్నారు.

ఆ శాఖలో అధికారులే కరువు..!

- ఏడాదికాలంగా కనిపించని డీఆర్
- ఇది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ తీరు

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్నతాధికారులు కనుచూపు మేరా కనిపించడం లేదు. దాదాపు ఏడాది కాలంగా అన్నమయ్య జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇన్‌చార్జిలతోనే కొనసాగుతోంది. జిల్లాలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏదైనా ఇబ్బంది అనిపిస్తే వారు డిస్ట్రిక్ కార్యాలయానికి వచ్చి డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌తో చర్చించాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఇక్కడికి డీఆర్‌గా చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న డీఆర్‌కు ఇన్‌చార్జ్‌గా ఇచ్చారు. అయితే రాయచోటిలో కనిపించిన దాఖలాలే లేవు. డీఆర్ అందుబాటులో లేకపోవడం వల్ల జనరల్ పవర్ పట్టా ఉన్న ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండెక్స్ పీడీ కొట్టడంలో కూడా ఏదైనా పొరపాటు జరిగితే దానికి సమాధానం చెప్పే నాథుడు లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్ని రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆగిపోయిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి. ఇంత పెద్ద జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్లు భర్తీ చేయకపోవడంపై చాలా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ ఆ కార్యాలయంలో సిబ్బంది కనుచూపుమేరా కనిపించడం లేదు. ఇప్పటికైనా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వారు అన్నమయ్య జిల్లా డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌ను నియమిస్తే బాగుంటుందని ఇక్కడ ప్రజలు కోరుకుంటున్నారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, రాయచోటి


డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రెండు వారాలుగా ఆ సీటు ఖాళీ

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాదాపు రెండు వారాల క్రితం ఇక్కడున్న సబ్ రిజిస్ట్రార్ కడపకు బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆ సీటు ఖాళీగా ఉంది. ఆ స్థానానికి సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి ఇచ్చి కాలం నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామాల్లో ఉన్నటువంటి గ్రామ కంఠాలన్నీ కూడా రిజిస్ట్రేషన్లకు చేసి అందిన కాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఇంత జరుగుతున్నా రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న పెద్దలు ఏం చేస్తున్నారు, అసలు అన్నమయ్య జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ విధులు సక్రమంగా నిర్వహిస్తుందా లేదా అన్న సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఈ కార్యాలయంపై దృష్టి పెట్టి సీటు భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.

జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వివరణ

ఈ విషయంపై డీఆర్ వెంకట్రమణ మూర్తిని వివరణ కోరగా... వారు ఇలా అన్నారు. నేను అక్కడికి రాలేను, ఈ రోజు నాకు కుప్పంలో క్యాంపు ఉంది. కాబట్టి నేను రాలేకపోతున్నాను అని అన్నారు.

నాడు-నేడు.. అసంపూర్తిగానే...

- ఆగిపోయిన పాఠశాల పక్కా భవనాలు
- రూ.3 కోట్ల నిధులు... పనులు అరకొరే...

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద 29 పాఠశాలల పక్కా భవనాలు 3 కోట్ల రూపాయలతో మంజూరయ్యాయి. అయితే వచ్చిన నిధులు వాడేసినా భవనాలు మాత్రం అసంతృప్తిగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా అసంతృప్తి భవనాలు పూర్తయ్యేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. 2022 సంవత్సరంలో మండలంలో 26 పాఠశాల భవనాలు, మూడు అంగన్వాడీ పక్కా భవనాలు మంజూరయ్యాయి. అయితే 29 పక్కా భవనాల్లో ఒక్క పాఠశాల కూడా పూర్తి కాలేదు. ఒక్కొక్క పాఠశాలకు 15 నుంచి 20 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. 2019 నాటికి పాఠశాల పక్కా భవనాలు కేవలం గోడలు, స్లాపు, పూతల వరకు పూర్తయి ఆగిపోయాయి. అప్పటి నుంచి ఇంతవరకు పట్టించుకోవడం లేదు. 3 కోట్ల రూపాయల్లో 2.90 కోట్లు నిధులు అయిపోయాయి. ఇంకా పనులు మాత్రం ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉన్నాయి. పందిళ్లపల్లె, కస్తూరిరాజుగారిపల్లె, లక్కిరెడ్డిపల్లె, కేజీబీవీ, దిన్నెపాడు, దేవళంపల్లి, కోనంపేట, దప్పేపల్లె గ్రామాల్లోని పాఠశాలల పక్కా భవనాలు కేవలం స్లాబు, పూతల వరకు వచ్చి ఆగిపోయాయి. ఆయా గ్రామాల్లో విద్యార్థులు పాత పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నారు. నాడు- నేడు రెండవ విడతలో మంజూరైన భవనాలు మాత్రం ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఉన్న నిధులు పూర్తయ్యాయి. భవనాలు మాత్రం అలాగే అసంతృప్తిగా దర్శనమిస్తున్నాయి. పందిళ్లపల్లె యూపీ స్కూల్‌లో పక్కా భవనం మంజూరైంది గానీ కేవలం స్లాబ్ వరకు వచ్చి పనులు ఆగిపోయాయి. ఆ పాఠశాల విద్యార్థులు చెట్ల కింద విద్యను అభ్యసిస్తున్నారు. దిన్నెపాడు పాఠశాలలో కడ్డీలు ఇంతవరకు అమర్చకుండా పాఠశాలలోనే తుప్పు పట్టిపోతున్నాయి. గొల్లపల్లి పాఠశాలలో కేవలం స్లాబ్ వేసి వదిలేశారు. విద్యార్థులు పాత భవనాల్లోనే విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల భవనాలు అసంతృప్తిగా ఉండడంతో చెట్ల కింద, బయట కూర్చుని విద్యను అభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైన ఆగిపోయిన పాఠశాల పక్కా భవనాలను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆగిపోయిన పక్కా భవనాల కోసం ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అసంతృప్తిగా ఉన్న పాఠశాల పక్కా భవనాలు పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.


స్లాబ్ వరకు వచ్చి ఆగిపోయిన పందిళ్లపల్లె యూపీ పాఠశాల పక్కా భవనం


అసంపూర్తిగా ఉన్న గొల్లపల్లె ప్రాథమిక పాఠశాల

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ముగ్గురి ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

రాజంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న సౌత్ జోన్ మహిళా కబడ్డీ జట్టులో రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ విద్యార్థులు స్థానం సంపాదించారు. ఈ నెల 27 నుంచి 31 వరకు కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ మహిళా కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధిదదంచిన జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికలో అత్యంత ప్రతిభ కనబరచిన కె.అఖిలసాయి, కె.భవిత, ఎం.నిఖిత మరో ముగ్గురు విద్యార్థినులకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి, యూనివర్సిటీ వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, బి.నాగముని, జయరామిరెడ్డిలు మెమెంటోలు అందజేసి అభినందించారు.

కోడిపందాల స్థావరాలపై దాడి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలం పెద్దపల్లె గ్రామ పంచాయతీ మిట్టపల్లె సమీపంలోని రైల్వేబ్రిడ్జి సమీపంలోని కోడిపందేల స్థావరాలపై దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అరెస్ట్ అయిన వారినుంచి రూ.10,500 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మండలంలో మట్కా, జూదం, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పప్పు దినుసుల మోడల్ ప్రయోజనకరం


కందిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

రామాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండావాండ్లపల్లె సమీపంలో పప్పు దినుసుల మోడల్‌ని డీఏవో శివనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి మోడల్స్ రైతులకు లాభదాయకమని ఖర్చులు తగ్గి ఆదాయం వస్తుందని, తక్కువ వర్షపాతంలోనూ దిగుబడులు వస్తాయని తెలియజేశారు. ఈ మోడల్‌లో కందితో పాటు అనుములు, అలసందలు, ఉద్దులు, పెసర్లు, ఆముదం, గోరుచిక్కుడుతో పాటు బార్డర్ క్రాప్ వేశారని ఇలా వేసుకుంటే ఒక పంట పోయినా ఇంకొక పంటలో ఆదాయం వస్తుందని తెలిపారు. ఏవో నాగమణి మాట్లాడుతూ ఇలాంటి మోడల్స్ ఆదర్శంగా ఉండాలని తక్కువ ఖర్చుతో పండించుకోవచ్చునని తెలిపారు. రామాపురం మండలం ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ఈ ప్లాట్‌లో ఆరు రకాల పప్పు దినుసులు వేశారని బార్డర్ క్రాప్స్‌గ ఎరపంటలు వేశామని, ఇలా ప్రతి రైతు వేసుకోవాలని తెలిపారు. మామిడి తోట ఉన్న ప్రతి రైతు కూడా నవధాన్యాలు సాగు చేయాలని, అలా చేస్తే మామిడిలో దిగుబడి పెరగడమే కాకుండా పొలంలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు వెంకట్రామిరెడ్డి, సుధాకర్, చిట్లూరు క్యాడర్ వీఏఏ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిప్పిలి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులు శనివారం జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో కార్తీకమాసం ప్రారంభమవుతోందని, అయ్యప్ప మాలదారులు అధికంగా ఆలయానికి వస్తారని వారికి సౌకర్యం కల్పించడానికి ఆలయంలో మరమ్మతు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయాన్ని శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో గ్రాప్ టెంపుల్ ఈఓ రమణ, దేవాదాయశాఖ సిబ్బంది అంకన్న, రాజశేఖర్, బీజేపీ జర్మనీరాజు, తదిరతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచండి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని, ప్రజలందరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం సంబేపల్లెలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడో శనివారం రోజు గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అనే ఇతివృత్తంతో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని పాశ్చాత్య దేశాలు మన సంస్కృతి నుంచి పరిశుభ్రతను నేర్చుకొని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇంట్లో అవసరాలకు ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ కవర్లను వినియోగించాలని సూచించారు.

సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమం చివరిగా మానవహారంగా ఏర్పాటు చేసి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయ శాఖాధికారి లక్ష్మీపతి, జిల్లా పంచాయతీశాఖ అధికారి రాధమ్మ, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. శనివారం మదనపల్లె టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో డీఎస్పీ నిందితుల వివరాలను వెల్లడించారు. తనకల్లు మండలం టి. సదుం గ్రామం, నందివారిపల్లె వాసి రామన్న, భార్య రమణమ్మ, భార్య తమ్ముడు బి.కొత్తకోట మండలం, బావగారిపల్లె వాసి ఈశ్వర్ కలిసి మదనపల్లె పట్టణం, రామారావు కాలనీలో ఇల్లు బాడుగకు తీసుకుని నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవించేవారు. బావ రామన్న రోజూ మద్యం సేవిస్తూ కూలి పనులకు వెళ్లకుండా, అక్కను కొట్టి వేధింపులకు గురిచేస్తుండగా, వేధింపులు, అప్పుల బాధ భరించలేక తమ్ముడు ఈశ్వర్‌తో కలిసి భార్య రమ్మణమ్మ ఈ ఏడాది మార్చి 12వ తేదీ మధ్యాహ్నం రమణమ్మ ఆమె తమ్ముడు ఈశ్వర్ రుబ్బురోలు రాయితో రామన్న తలపై మోది హత్య చేశారు.

స్కూల్‌కు వెళ్లిన పిల్లలను ఇంటికి రావద్దని, బంధువుల ఇంటికి పంపి, అదేరోజు రాత్రి మృతదేహాన్ని గోనె సంచిలో వేసుకుని తమ స్కూటీపై తీసుకెళ్లి మదనపల్లెకు 45 కిలో మీటర్ల దూరంలో బి.కొత్తకోట, కస్తూర్బా పాఠశాల సమీపంలో హంద్రీనీవా కాలువ గట్టున పాతిపెట్టారు. మృతుడి అన్న లక్ష్మన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో అదృశ్యం కేసు నమోదు చేశారు. మృతుడి అన్న నిందితులు ఇద్దరిపై అనుమానం వ్యక్తం చేయడంతో శుక్రవారం మధ్యాహ్నం స్థానిక రామారావు కాలనీలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు వాస్తవాలు తెలిపారని, ఈ మేరకు బి.కొత్తకోట సమీపంలో మృతదేహాన్ని పూడ్చిపెట్టిన స్థలం వద్దకు కొత్తకోట తహసీల్దార్, మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహింతుల్లా నిందితులతో కలిసి వెళ్లి అక్కడ రామన్న మృతదేహం పూడ్చిన గోనె సంచిని తవ్వి పైకి తీసి రీపోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ ఎముకలు మాత్రమే లభించాయి. అవి ల్యాబ్‌కు పంపి నిందితులపై హత్య కేసు నమోదు చేశామని డీఎస్పీ పేర్కొన్నారు.


నిందితుల అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

దళితుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రతి నెలా సివిల్ రైట్స్ డే నిర్వహిస్తోందని కేవీపల్లె తహసీల్దారు నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. కేవీపల్లె మండలం నూతనకాల్వ పంచాయతీ దోర్నాలపల్లెలో శనివారం నేషనల్ సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా దోర్నాలపల్లె మాదిగపల్లెలో వెలుగు సంఘమిత్రగా పనిచేసిన వ్యక్తి సభ్యుల నిధులు గోల్‌మాల్ చేశాడని ఏపీ ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ ముల్లంగి చంద్రయ్య ఫిర్యాదు చేయగా వెంటనే అతన్ని తొలగించి వేరే వారిని నియమిస్తామని ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. వీధి లైట్లు సరిగ్గా వెలగడం లేదని, తమకు ఉపాధి ద్వారా పనులు కల్పించాలని, తమ ఇళ్లు ఉరుస్తున్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేయడంతో సంబంధిత శాఖల సిబ్బందిని ఆయా పనులు చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. నూతన కాల్వలోని ఓ హోటల్ నిర్వాహకులు కులవివక్ష పాటిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా అధికారులు హోటల్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా భవిష్యత్తుల్లో కులవివక్ష పాటిస్తే హోటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నరెడ్డప్ప, ఏపీఓ నాగరాజు, ఏపీఎం అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిబాబు, ఏపీ ఎంఆర్‌పీఎస్ నేతలు శ్రీనివాసులు, నాగేశ్వరయ్య, అశోక్ సామ్రాట్, ఆంజనేయులు పాల్గొన్నారు.



సివిల్ రైట్స్ డేలో అధికారులు, ప్రజాసంఘాల నేతలు

అనుమతి లేకుండా కలప రవాణా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా పచ్చని చెట్లు కూల్చాలన్నా, రవాణా చేయాలన్నా అటవీశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి, కాని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో ఎప్పుడో కూల్చేసిన మూడు చెట్లను ఇప్పుడు కొందరు అనుమతి లేకుండా పట్టపగలే రవాణా చేయడం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఆరునెలల కిందట మూడు చెట్లు నేలకూలాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వాస్పత్రి వర్గాలు వీటిని బహిరంగ వేలం వేసి కలపను విక్రయించాలి. కలప కొనుగోలు చేసిన వ్యక్తి అటవీశాఖ అనుమతి తీసుకుని రవాణా చేయాలి. కానీ ఇవేమీ జరగకనే శనివారం చెట్ల మొదళ్లను ముక్కలు చేసి కలపను ట్రాక్టర్లలో ఎత్తి రవాణా చేసేశారు. ఈ విషయమై మదనపల్లె ఎఫ్ఆర్ఓ ప్రసాదరావును వివరణ కోరగా, ప్రభుత్వాస్పత్రిలో కలప రవాణాను అనుమతి ఇవ్వలేదని, దీనిపై విచారించి అక్రమ రవాణా చేసివుంటే అటువంటి వ్యక్తులకు జరిమానా విధిస్తామన్నారు.


ట్రాక్టర్‌లోకి కలపను లోడ్ చేస్తున్న కూలీలు

ప్రిన్సిపాల్‌పై డీఈవో విచారణ


ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం

కలకడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలకడ ఆదర్శ పాఠశాల గత ప్రిన్సిపాల్, ప్రస్తుత ప్రిన్సిపాల్ మలాంషావలిపై శనివారం డీఈఓ సుబ్రహ్మణ్యం విచారణ చేపట్టారు. పాఠశాల పునఃప్రారంభమైన జూన్‌లో ఇక్కడ విధుల్లో ఉన్న మలాంషావలి పురుగులు పట్టిన బియ్యంతో అన్నం చేయించారని అప్పట్లో పాఠశాల కమిటీ ఛైర్మన్ రమేష్‌నాయుడు డీఈఓకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై జూన్ 20వ తేదీన మదనపల్లె డీవైఈఓ లోకేశ్వరరెడ్డి విచారణ జరిపి ప్రాథమిక నివేదిక అందజేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మలాంషావలి తీరుపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, గతంలో పని చేసిన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, మధ్యాహ్నభోజన నిర్వాహకులను డీఈఓ విచారించారు. సేకరించిన వాస్తవ పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని డీఈఓ తెలిపారు. అంతకుమునుపు ఆయన ఎండీఎంఏడీ రవికుమార్‌తో కలిపి మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు నరసింహారెడ్డి, ఎంఈఓ మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ గోవిందు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి


వృద్ధురాలు కీరవాణి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో కీరవాణి(60) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం, సీటీఎం గ్రామం, పడమటివీధికి చెందిన మురళీ భార్య కీరవాణితో కలిసి బైక్ మీద సీటీఎం సమీపంలో తమకు ఉన్న కళ్యాణ మండపం వద్దకు వచ్చి శనివారం మధ్యాహ్నం ఇంటికి తిరుగు ప్రయాణంలో సీటీఎం క్రాస్ వద్ద మదనపల్లె ఆర్టీసీ అద్దె బస్సు ఓవర్‌టేక్ చేస్తూ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందగా మురళికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే మృతురాలి బంధువులు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ జానకీరాంను చితకబాదారు. కేసు ఏమీ వద్దని మృతదేహాన్ని అక్కడ నుంచి సీటీఎంకు తీసుకెళ్లారు. వెంటనే తాలుకా పోలీసులు రంగ ప్రవేశం చేసి మృతదేహాన్ని పరిశీలించి పోర్టుమార్టం నిమత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ అద్దె బస్సును తాలుకా స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి


ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ శనివారం రాయచోటి పట్టణంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట కార్మికుల కుటుంబాలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతులూరి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కాంట్రాక్ట్ కార్మికులన్నీ రెగ్యులర్ చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షల రూపాయలు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అది పరిష్కారం కాకపోతే అక్టోబర్ 6న తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేస్తామన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు, ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి హరి, ఏవీ రమణ, రెడ్డెప్ప, కిరణ్, శ్రీనివాసనాయుడు, మన్నాథ్‌రెడ్డి, రామాంజి, శ్రీనివాసులు, స్వాతి, సుజాత, సరస్వతి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాయచోటి, రాజంపేట డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, సురేంద్ర, మదనపల్లి, పీలేరు డివిజన్ నుంచి కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం ధర... దయనీయం

● గోడౌన్లలో మగ్గుతున్న నిల్వలు ● నిరాశపరుస్తున్న వడ్ల ధరలు ● ఆందోళనలో రైతన్నలు


రైతులు గోడౌన్‌లో నిలువ ఉంచిన ధాన్యం బస్తాలు

దువ్వూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ధరలు రైతన్నలను తీవ్ర నిరాశపరుస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన వడ్లకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో సంబంధిత రైతులు దిగాలు పడుతున్నారు. కిందటి సంవత్సరం డిసెంబరులో చేతికి వచ్చిన పంటకు సరైన ధర రాకపోవడంతో గోడౌన్లలో నిలువ ఉంచారు.

పేరుకుపోయిన నిల్వలతో ఆందోళన

నియోజవకర్గంలోని చాపాడు, దువ్వూరు, ఖాజీపేట మండలాల్లో కేసీ ఆయకట్టులో విస్తృతంగా వరి సాగవుతోంది. కిందటి సంవత్సరం 37 వేల ఎకరాల్లో వరిసాగైనట్లు వ్యవసాయశాఖ తెలుపుతోంది. ఈ సమయంలో ఆశించిన ధరలేకపోవడంతో రైతులు పండించిన పంటను ఇళ్లలో, గోడౌన్లలో నిలువ ఉంచారు. మొత్తంగా 12 లక్షల బస్తాలు నిలువ ఉంటాయనేది ప్రాథమిక సమాచారం. వందల మంది రైతులు గిట్టుబాటు ధర కోసం నిరీక్షిస్తున్నారు.

పెరగని ధరలు - నిలువల్లో తరుగులు

రెండేళ్లుగా గోడౌన్లలో ధాన్యం నిలువలు పేరుకుపోతున్నాయి. ధర గిట్టుబాటు కాదని.. విక్రయించేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. గత డిసెంబరులో నిలువ ఉంచిన ధాన్యం రేటు పెరుగలేదు. అంతకుముందు సంవత్సరం ధాన్యానికి మాత్రం కొంత రేటు ఉంది. బస్తా రూ.2,300 ధర పలుకుతుండడంతో వాటికి సంబంధించి విక్రయాలు కొనసాగుతున్నాయి. నిరుడు ధాన్యం బస్తా రూ.1900 మాత్రమే ధర ఉండడంతో విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. పంట చేతికందే సమయంలో ఇదే ధర ఉండేది. పాత ధాన్యానికి మాత్రం ధర విషయంలో కొంత మార్పు చోటు చేసుకుంది. నిలువ ఉంచిన ధాన్యానికి తరుగుతు పోతుందని.. ధరలు మాత్రం పెరగడం లేదని రైతులు వాపోతున్నారు. వడ్ల రకాలను బట్టి ధరల్లో మార్పు చోటు చేసుకుంటోంది.

అయోమయంలో రైతులు

వరిసాగు చేస్తున్న రైతుల్లో అయోమయం నెలకొంది. సాగు ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ధరలు పెరడంలేదని వీరి వాదన. సాగునీరు ముందుగానే రావడంతో నియోజకవర్గంలో మరో రెండు వేల ఎకరాల మేర ఈ ఏడు విస్తీర్ణం పెరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇదే వ్యాపారులు మార్కెట్‌లో విక్రయిస్తున్న బియ్యానికి మాత్రం ధర తగ్గడం లేదు. ఈ తతంగం వెనుక మతలబు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాము ఆరుగాలం కష్టించి పండిస్తే గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర రాక ధాన్యం విక్రయించలేదు



గత ఏడాది పండించిన ధాన్యానికి ఇప్పటికీ సరైన ధర రాలేదు. 13 ఎకరాల్లో వరి పంట సాగు చేసి.. వచ్చిన దిగుబడిని గోడౌన్‌లో అలాగే నిలువ ఉంచాను. సంచుల ఖర్చు, నిలువ చార్జీలు, తరుగుదల ఇలా లెక్కలు వేస్తే ధర గిట్టుబాటు కావడం లేదు. పండిన వెంటనే విక్రయించి ఉంటే బాగుండేది. పది నెలలుగా వడ్లను అలాగే నిలువ ఉంచాను.

\- జయరామక్రిష్ణారెడ్డి, రైతు, ఎర్రబల్లి గ్రామం, దువ్వూరు మండలం

బీటెక్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఫస్ట్, సెకండ్, థర్డ్ బీటెక్ కోర్సులకు సంబంధించి రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మేనెలలో బీటెక్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, ఎంఎంటీ, ఎంఈ విభాగాల ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. పరీక్షల విభాగాన్ని, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రశంసించారు. రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపాల్ బి.జయరామిరెడ్డి, ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, పరీక్షల కంట్రో లర్ ప్రొఫెసర్ కృష్ణారావు, అసిస్టెంట్ కంట్రోలర్స్ సుభోస్‌చంద్ర, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

● 19 మంది విద్యార్థులు ఎంపిక


విద్యార్థులకు నియామకపత్రాలు అందిస్తున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్లేస్ మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన క్యూ స్పైడర్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ ను నిర్వహించింది. ఈ డ్రైవ్‌లో ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంఎస్సీ డేటా సైన్స్ విభాగాల విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ప్రతిభావంతులను కంపెనీ ప్రతినిధులు ఐశ్వర్య, అరు ణిమలు ఎంపిక చేశారు. 19 మంది విద్యార్థులు ప్రోగ్రామింగ్ డెవలపర్ ఉద్యోగాలను సాధిం చారు. ఎంపికైన వారికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు నియామ కపత్రాలను అందించారు. పీజీ చదువుతూనే రూ.3లక్షల నుంచి రూ.9లక్షల వరకు వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందడం విశేషమని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ కె.లలిత, డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

నీకేదిన్నె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ తెలిపారు. కృషి విజ్ఞానకేంద్రం ఊటుకూరులో శనివారం ఘనంగా మిల్లెట్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి, కొర్ర, సజ్జ, జొన్నలు వంటి చిరుధాన్యాలపై మక్కువ పెంచుకుని వాటిని ఇష్టంగా తిని ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో సాగు చేసి అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్నారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం ద్వారా చిరుధాన్యాల ఆవశ్యకతను ప్రపంచం మొత్తం గుర్తించిందన్నారు. మెప్మా పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల వ్యాపారవేత్తలను ప్రోత్సహించి ప్రాసెసింగ్ యూనిట్లను రైతు సోదరులు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తుందన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానశాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాలకు ప్రధాన సమస్య యాంత్రీకరణ అని, దానిని అధిగమించి చిరుధాన్యాల్లో ప్రాసెసింగ్ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రెడ్డికుమార్, శారద, శాంతిప్రియ చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు


ద్విచక్ర వాహనాలు, దొంగను చూపుతున్న పోలీసులు

మైదుకూరు సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు తెలంగాణలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన దొంగను బ్రహ్మంగారిమఠం పోలీసులు అరెస్టు చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. కడప పట్టణం అశోక్ నగర్‌కు చెందిన గణేష్ బ్రహ్మంగారిమఠం వద్ద ఓ వ్యక్తిని బెదిరించి ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లడంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నిఘానేత్రాల ద్వారా గుర్తించి వాహనాల తనిఖీలో పట్టుకొని విచారించామన్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు తెలంగాణాలో కూడా వివిధ రకాల కేసులు ఉండడంతో అరెస్టు చేసి, రూ.5లక్షలు విలువ చేసే 10 ద్విచ క్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సీఐ శివశంకర్, ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బందిని అభినందిస్తూ రివార్డులను అందించారు.

ముగ్గురు దొంగలు అరెస్టు

వేంపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం గండి రోడ్డులోని పిల్లస్వామి గుట్ట జగనన్న కాలనీలోని ఓ ఇంటిలో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను రెండురోజుల్లోనే వేంపల్లె పోలీసులు పట్టుకున్నారు. కాలనీలో నివాసముంటున్న నాగేంద్ర, వాణి దంపతులు పనులకు వెళ్లిన సమయంలో ఈనెల 18వ తేదీ ఇంట్లోకి ప్రవేశించి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ముగ్గురు దొంగతనం చేసినట్లు తేలింది. పులివెందుల డీఎస్పీ ఆధ్వర్యంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ ఖాదర్‌వలి మరో ఇద్దరు మైనర్లను సీఐ నరసింహులు, ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్‌లు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 6.6తులాల బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లి పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై తిరుపతి నుంచి వస్తున్న లారీ కోడూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ఇరువురు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురిని స్థానికులు 108 వాహనంలో కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బొలెరో వాహనం డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని రూయా అసుపత్రికి తరలించారు. ప్రధాన రోడ్డుపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగింది. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధంచారు.

ఆర్టీపీపీలో ఆధిపత్యపోరు

● జేఏసీ వర్సెస్ తెలుగునాడు కార్మిక సంఘాల మధ్య ఘర్షణ ● ఇద్దరికి స్వల్ప గాయాలు



ఆర్టీపీపీలో రిలే దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, మెయిన్‌గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న తెలుగునాడు కార్మిక సంఘం నేతలు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా పోరాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన కార్మిక సంఘాలు ఆర్టీపీపీలో ఆదిపత్యపోరు ప్రదర్శిస్తూ ఘర్షణకు పాల్పడుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఆర్టీపీపీలో ఉద్యోగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ 15వ తేదీ నుంచి దశలవారీగా ఆందోళన చేస్తోంది. అందులో భాగంగా శనివారం రిలే దీక్షలు చేపట్టింది. అయితే అదే సమయంలో తెలుగునాడు కార్మిక సంఘం కొన్ని కార్మిక సంఘాల మద్దతుతో గేటు ఎదుట ధర్నా చేస్తున్నారు. జేఏసీ నాయకులు ప్లాంటు లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఆందోళన చేస్తుండగా లోపలికి ఎలా వెళ్తారంటూ జేఏసీ నాయకులను తెలుగునాడు అడ్డుకుంది. దీంతో అక్కడ తోలుపులాట జరిగి తెలుగునాడు కార్మిక సంఘం నాయకులు పులి సుధాకర్‌రెడ్డి, మనోహర్‌కు గాయాలయ్యాయి. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెల కొంది. ఇది చిలికిచిలికి గాలివానలా రాజకీయ జోక్యం వరకు వెళ్లింది. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు పోలీసుస్టేషన్‌కు పిలిపించి పంచాయితీ చేశారు. ఇందులో భాగంగా జేఏసీ నాయకులు జగదీష్ తదితరులు మెయిన్‌గేటు దగ్గరలో ఉన్న జేఏసీ శిబిరంలో మాట్లాడుతూ జాయింట్ యాక్షన్ కమిటీ తరుపున ఏదైనా పొరపాటు జరిగివుంటే దానికి పూర్తి బాధ్యతగా క్షమాపణ చెబుతున్నట్లు బహిరంగంగా పేర్కొన్నారు. పులిసుధాకర్‌రెడ్డి, మనోహర్ టీఎన్‌టీ యూసీ ఇతరులెవరైనా సరే ఈ పోరాటం ఆగేందుకు ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కారం చేయాలని.. అప్పుడు మేమం దరం మీవెంట నడుస్తామని ప్రకటించారు. గత ఐదేళ్లగా ఈ సమస్యలు పరిష్కరించలేదని, ఈఐదేళ్లలో కూడా తమకు న్యాయం జరిగేది లేదని కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు గుసగుసలాడు కోవడం కొసమెరుపు. నాయకులు ఆదిపత్యపోరు, ఉనికి కాపాడు కోవడం తప్ప తమకు ఒరింగిందేమిలేదని చెవులుకొరుక్కుంటున్నా రు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థులు ఎంపిక


కర్రసాము చేస్తున్న విద్యార్థినులు

చెన్నూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఎంపి కల్లో భాగంగా మండలంలోని రామనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన కత్తి సాము, కర్రసాము పోటీల్లో రామనపల్లె విద్యా ర్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా అండర్ 19 బాల బాలికల పోటీల్లో కత్తిసాము, కర్రసాము పోటీల్లో పలు మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ మెంబరు గణేశ్‌బాబు, వసంత్, ఫాతిమా, ప్రశాంతి, నాగేశ్వర్‌రెడ్డితో పాటు సెక్రటరీ చంద్రమౌళిరాజు, చంద్రావతి పాల్గొన్నారు. కత్తిసాములో నందిని, నాగచైతన్య, సుశాంతి ఎంపిక కాగా, కర్రసాములో శిరీష, వరుణ్ ఎంపికయ్యారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

తప్పిపోయిన పిల్లలు.. తల్లిదండ్రుల చెంతకు!

● కడప తాలూకా పోలీసులకు ప్రజల మన్ననలు


బాలురను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కడప క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప తాలుకా పోలీ సుస్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఇద్దరు బాలురను కేవలం గంటల్లోనే గుర్తించి తిరిగి వారిని వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చి ప్రజల మన్న నలు పొందారు. కడప తాలుకా సీఐ టి.రెడ్డప్ప వివరాల మేరకు.. నగ రంలోని ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న సాయిబాబా స్కూలులో 8వతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు టి.కౌశిక్ కుమార్‌రెడ్డి, ఎస్.ప్రణయ సాయిరెడ్డిలు ఇద్దరూ స్నేహితులు. అయితే శుక్రవారం మధ్యాహ్నం 1.30గంలకు స్కూలు నుంచి కనిపించకుండా వెళ్లిపోయారు. వారి కోసం ఎంత వెదికినా ఆచూకీ లభ్యం కాక తల్లిదండ్రులు, స్కూలు యాజమాన్యం శుక్రవారం సాయంత్రం తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంక టేశ్వర్లు పర్య వేక్షణలో పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. బృందాలుగా విడిపోయి నగరం నలుమూలలా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ టీవీల రికార్డులు పరిశీలించి.. గంటల వ్యవధిలోనే ఆ బాలురు తిరు పతి రైల్వేస్టేషనులో ఉన్నట్లు గుర్తించారు. పోలీసు సిబ్బందిని తక్షణమే తిరుపతి రైల్వేస్టేషనుకు పంపి విద్యార్థులను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈసందర్భంగా కడప తాలుకా పోలీసు యంత్రాంగానికి బాలుర తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపా రు. కాగా, తప్పిపోయిన బాలురను అతికొద్దిగంటల్లోనే గుర్తిం చి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన తాలుకా సీఐ రెడ్డప్ప, ఎస్‌ఐ తాయార్ హుసేన్, సిబ్బందిని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాద్ అభినందించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా విద్యాసంస్థలు విద్యా ర్థుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు.

శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరం


పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను వివరిస్తున్న డాక్టర్ సాయిశ్రీనివాస్

పులివెందుల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలు, పండ్లు పండిస్తున్న రైతులకు ఏర్పాటు చేస్తున్న శిక్షణా కార్యక్ర మాలు ఎంతో ఉపయోగకరమని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ అన్నారు. శనివారం ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల బెంగుళూరు ఐఐ పీఎం, ఫ్రెండ్స్ ఆఫ్ ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ సొసైటీ సంయు క్తంగా చిరుధాన్యాల విలువ జోడింపు, మార్కెటింగ్ మరియు బ్రాండింగ్ అనే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా డీఎన్ మాధవ మాట్లాడుతూ పండ్లు, చిరుధాన్యాలు ప్రాసెసింగ్ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరమన్నారు. జ్యూస్ బాటిలింగ్, ఆటోమేటిక్ యంత్రా లు, చిరుధాన్యాల శుభ్ర పరిచే యంత్రాలు, చిరుధాన్యాల నుంచి రవ్వ, పిండి చేసే యంత్రాలను ఉపయోగించి ఆహార పదార్థాలు తయారు చేసే ప్రక్రియను శిక్షణా కార్యక్రమానికి వచ్చిన రైతు లకు ప్రత్యక్షంగా వివరించారు. అలాగే కళాశాల అధ్యాపకులు ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్ కళాశాలలోఉన్న లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఉన్న యంత్రాల పని తీరును వివరిస్తూ సాంకేతిక సమాచారాన్ని రైతు లకు అందించారు. పండ్లతో కస్టర్డ్ డ్రింక్, జల్ జీరా డ్రింక్, జామ్, జెల్లీ, రక రకాల చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే విధాన ప్రక్రియలో కూడా స్వయంగా రైతులు పాల్గొన్నారు. కార్య క్రమంలో ఐఐపీఎం ప్రతినిధి డాక్టర్ నబీరసూల్, కళాశాల అధ్యా పకులు డాక్టర్ రాజేష్, డాక్టర్ జాకీర్ బాష, పీడీ డాక్టర్ రాజశేఖ ర్, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల సొసైటీ సభ్యులు, ఎఫ్‌పీఓలకు చెందిన రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్య తీర్చండి

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజల వినతి



కుషావతినది ఉధృతి ప్రవాహానికి స్తంభించిన ప్రజల రాకపోకలు

పెద్దమండ్యం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం కుషావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలని ప్రభుత్వం, అధికారులను ప్రజలు కోరారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం దశాబ్దాలుగా ప్రతిపాదనలు చేస్తున్నా ఫలితం శూన్యమనే చెప్పాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారనేందుకు ఈ బ్రిడ్జి నిర్మాణమే ప్రత్యక్ష సాక్ష్యం. ఈ మార్గంలో భారీ బ్రిడ్జి లేక ఏటా వర్షాకాలంలో ప్రయాణీకులు, స్థానిక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. వాహనాల రాకపోకలు కూడా స్థంభించిపోతాయి. పెద్దమండ్యం సమీపంలోని కుషావతినదిపై బ్రిడ్జి నిర్మించాలని తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యే ద్వారకనాధరెడ్డిని ప్రజలు కోరినా ఇప్పటి వరకు బ్రిడ్జి నిర్మాణం రూపు దాల్చలేదు. వర్షాకాలంలో బ్రిడ్జి నిర్మిస్తామంటారు. ఎండకాలంలో మరిచిపోతారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నీవర్ తుఫాన్‌తో నదిపై ఉధృతికి వ్యాన్ కొట్టుకు పోయి కలిచెర్లకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం కురిసిన వర్షం, వర్షపు నీటి ఉధృతికి ఆటో కొట్టుకు పోగా అందులోని ప్రయాణీకులను స్థానికులు కాపాడారు. నాలుగేళ్ల కిందట తరిగొండ- గుర్రంకొండ, పెద్దమండ్యం డబుల్‌రోడ్డు నిర్మాణంలో మంజూరైన బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందుగా పెద్దమండ్యం మండల జనసేన అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నేతలు, మండల జనసేన అధ్యక్షుడు, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్‌కు పెద్దమండ్యం బ్రిడ్జిపై విజయవాడలో వివరించారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని పెద్దమండ్యం సమీప కుషావతినదిపై భారీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు.

వేలిముద్రల తనిఖీతో అపరిచితులకు చెక్



వేలిముద్రల ద్వారా తనిఖీ చేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

వాల్మీకిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు కొత్తగా పోలీసు శాఖ ద్వారా అమల్లోకి తెచ్చిన వేలిముద్రల తనిఖీ, ఆధారాల సేకరణను శనివారం వాల్మీకిపురంలో పోలీసులు ముమ్మరం చేశారు. ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి గాంధీ బస్‌స్టాండ్, జాతీయ రహదారి, ఇరానీకాలనీ, ఇందిరమ్మకాలనీ, ఎన్టీఆర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో తనిఖీ చేపట్టారు. యాప్‌లో వాహనచోదకులు, స్థానిక నివాసితులు, బయటి ప్రాంతీయుల వేలిముద్రలను తనిఖీ చేస్తూ వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోపాల్‌నాయక్, సిబ్బంది నాగేంద్ర, సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో జలకళ

● టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు



సోంపల్లె పెద్దచెరువు వద్ద పూజలు నిర్వహించిన టీడీపీ నేతలు దొరస్వామినాయుడు, పాలగిరి సిద్దా

ములకలచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఫలితంగా రాష్ట్రం సుభిక్షంగా ఉందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యవనేత కట్టా దొరస్వామి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా అన్నారు. నిండి మొరవపోతున్న ములకలచెరువు, సోంపల్లె పెద్ద చెరువుల వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదేళ్లగా నిండని ములకలచెరువు, సోంపల్లె పెద్ద చెరువులు ఇప్పుడు నిండి మొరవపోవడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. చంద్రబాబు పాలనలో నియోజకవర్గంలో జలకళ నెలకొందన్నారు. నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నేతలు తంబళ్ల శివన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

మడుమూరు ఎస్సీ కాలనీలోకి చేరిన వర్షపు నీరు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబ రు 20 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులు కుంటలు, వాగులు, వంకలు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మడుమూరు జంబుగాని చెరువుకు వరద ఉధృతి రావడంతో చెరువు నిండి మొరవ పోతోంది. అయితే మొరవను ఆనుకుని పక్కన ఉన్న భూములు ఆక్రణకు గురవడంతో పక్కనే ఉన్న ఎస్సీ కాలనీ ఇళ్లలోకి నీరు చేరుతున్నాయి. దీంతో కాలనీ వాసులు రెండు రోజులుగా బిక్కుబిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఎగువ ప్రాంతంలో ఇంకా వర్షాలు కురిస్తే ఎస్సీ కాలనీకి ప్రమాదం పొంచి ఉందని కనీసం ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రత్యామ్నాయం చేపట్టాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మం డల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీరాములు నాయక్ ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నీటితో ప్రవ హిస్తున్నాయని ఇంకా రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వివరించారు.

తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలి

కలకడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఇంటినీ సందర్శించి తడి, పొడి చెత్త నిర్వహణపై డీపీఓ రాధమ్మ ప్రజలకు అవగాహన కల్పించారు. శిక్షణలో ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో క్రమంతప్పకుండా చెత్తను సేకరించాలని ఆదేశించారు. డంపింగ్ యార్డులకు తరలించిన చెత్తతో వర్మీకంపోస్టు తయారీ చేయాలని సూచించారు. డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ భానుప్రసాద్, సర్పంచ్ ప్యారీజాన్, కార్యదర్శి శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దమండ్యం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్రప్ప(23) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు పెద్దమండ్యం పోలీసులు తెలిపారు. వడ్డిపల్లి వాసి రాందాసు కుమారుడు గుర్రప్పకు ఫిట్స్, కడుపు నొప్పి వచ్చేది. కొన్నేళ్లగా చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. 17వ తేదీ గుర్రప్పకు ఫిట్స్, తీవ్ర కడుపు నొప్పి రావడంతో ఆత్మహత్య చేసుకోబోయాడు కుటుంబీకులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రాయచోటికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అనిబీసెంట్ సేవలు చిరస్మరణీయం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇండియాకు వచ్చిన ఐరిష్ వనిత స్వాతంత్ర్యం కోసం పోరాడిన, విద్యావేత్త అనిబీసెంట్ మదనపల్లె ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ శ్రీదేవి పేర్కొన్నారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర నిర్మాణం ● పర్యావరణాన్ని విస్మరిస్తే మనుగడ ప్రశ్నార్థకమే







స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష - నిమ్మనపల్లిలో ర్యాలీ చేపడుతున్న అధికారులు - కలికిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మదనపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మొక్కలే మానవాళి మనుగడకు ప్రాణం అని, అలాంటి మొక్కలను నాటడం ప్రతిఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్రలో భాగంగా స్థానిక కోమటివానిచెరువు కట్టపై శనివారం మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. ఇంటా, బయటా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, సామాజిక శుభ్రత పాటించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటి, నీళ్లు పోశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. స్థానిక బస్‌స్టాండులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ నిర్వహించారు. విద్యార్థులచే ర్యాలీ చేపట్టి ప్లాస్టిక్‌ను నియంత్రించాలని నినాదాలు చేశారు. నిత్యం చెత్త సేకరణకు వచ్చే కార్మికులకు చెత్తను క్రమం తప్పకుండా వేయాలన్నారు. బస్ స్టాండు సమీపంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్తను వేయరాదన్నారు. వర్షాకాలం కావడంతో చెత్త పేరుకుపోకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, హెచ్ఎం అంజాద్, కార్యదర్శి నాగరాజ, ఎంసీఓ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే....

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యం ఉంటేనే స్వచ్ఛాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ర్యాలీ చేపట్టారు. బస్ స్టాండు కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతి ఒక్కరూ స్వచ్ఛాం ధ్రలో భాగస్వాములవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రీన్ అంబాసిడర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరిలో ర్యాలీ...

కలికిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర చేపట్టారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. హరితాంధ్ర లక్ష్య సాధన కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ భానుమూర్తి రావు, డిప్యూటీ ఎంపీడీఓ మహ్మద్ రియాజుద్దీన్, ఏఓ సురేంద్ర బాబు, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి, సచివాలయాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ కె.స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు స్వచ్ఛాంధ్ర చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్, అన్ని విభాగాల వైద్యులు, నర్సులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని విస్మరిస్తే....

కురబలకోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని విస్మరిస్తే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమేనని ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. అంగళ్లు సచివాలయ ఆవరణలో మెక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, కార్యదర్శి ఉదయ్‌కుమార్, ఏపీఓ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ

రామసముద్రం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా లతీఫ్‌ఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న భాను ప్రసాద్ కలకడకు బదిలీ అవడంతో ఇన్‌చార్జి ఎంపీడీఓగా గఫూర్ విధులు నిర్వర్తిస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రమోషన్‌పైన ఇక్కడికి వచ్చానన్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు వేయించాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనం వెనుక వైపు ఎరుపు రేడియం స్టిక్కర్ అతికించేలా రవాణా అధికారులు చర్యలు తీసుకోవాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ పేర్కొన్నారు. కార్యాలయంలో ఆర్టీఓ అశోక్ ప్రతాప్‌కు బీవైఎస్ నేతలు వినతి పత్రం అందజేశారు. వెనుక వైపు ఎరుపు రంగు రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో రాత్రిళ్ల రోడ్డు పక్కన పార్కింగ్ చేసే వాహనాలను వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రయాణికుల ప్రాణాలు పోతున్నాయన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు.

రేపటి నుంచి యల్లమ్మ తల్లి నవరాత్రులు ప్రారంభం

కలికిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి ఆలయంలో సోమవారం నుంచి నవరాత్రులు ప్రారంభవుతున్నట్లు ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. 22న సోమవారం బాలాత్రిపురసుందరి అలంకారం, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయనీదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న లలితాత్రిపురసుందరీదేవి, 28న మహాచండీదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, 1న మహిషాసురమర్ధినిదేవి, 2న రాజరాజేశ్వరీదేవి అలకారంతో నవరాత్రోత్సవాలు ముగుస్తాయన్నారు.

ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ కోసం పరిశీలన



పీసీ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గఫూర్, తదితరులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ కింద ఓడీఎఫ్ ప్లస్ విలేజ్ కోసం రామసముద్రం మండల ఎంపీడీఓ గఫూర్ మండలంలోని గ్రామాల్లో శనివారం పర్యటించారు. రెడ్డివారిపల్లి, ముష్టూరు, కొండయ్యగారిపల్లి, నిమ్మనపల్లి, అగ్రహారం పంచాయతీల్లో చేపడుతున్న ఎస్‌డబ్ల్యుపీవ్ పీసీ కేంద్రాలు, చెత్త సేకరణ, మరుగుదొడ్ల వాడకం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు అన్ని పంచాయతీల్లోనూ అభివృద్ధి సక్రమంగా జరుగుతున్నాయని ముఖ్యంగా చెత్త సేకరణ మెరుగ్గా చేపడుతున్నట్లు తెలిపారు. ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ ఎంపిక కోసం గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. రామసముద్రం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రియాజ్, ఎంపీఓ గుర్రప్ప పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు చౌకదుకాణాల వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె మండలంలోని 101 చౌకదుకాణాలకు 62,983 స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. వయో వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే సచివాలయ సిబ్బంది వచ్చి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తారని, మిగిలిన వారికి ఆయా చౌకదుకాణాల డీలర్లు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్, టీడీపీ నేతలు జంషీర్, జేసీబీ మధు, బాబునాయుడు, తలారి రాధ, పులి మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డులు పంపిణీ

ములకలచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బురకాయలకోటలో శనివారం ప్రభుత్వం అందిస్తున్న నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ హరినారాయణ కొత్త కార్డులు పంపిణీ చేశారు. సీఎస్ డీటీ సుబ్బయ్య, జిల్లా చౌకదుకాణ డీలర్ల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు విజయ్‌కుమార్, బీజేపీ నేతలు ద్వారకనాద్, డీలర్లు అనిల్‌కుమార్, శ్రీలత, పద్మావతి, నరసింహులు, కృష్ణమూర్తి, తిరుమల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో...

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రేషన్ షాపుల్లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. డీలర్లు కార్డుదారుల నుంచి ఈకేవైసీ నమోదు చేసుకుని కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పీటీఎంలో మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్‌బాబు, కార్యం సుబ్రమణ్యం, పెనుగొండ శ్రీనివాసులు, రంగసముద్రంలో వీఆర్వో రామకృష్ణ, మహబూబ్‌బాష, నారాయణ మూర్తిగంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అక్రమాలకు చెక్

తంబళ్లపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని టీడీపీ నేతలు అన్నారు. శనివారం మండలంలోని అన్ని చౌక దుకాణాల్లో టీడీపీ నేతలు స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ఎర్రసానిపల్లె గ్రామాధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, విశ్వనాథరెడ్డి, క్రిష్ణమూర్తి, వై.సుధాకర, రామచంద్ర, మాధవరెడ్డి, సుధాకర్, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం చేసి ప్రాణదాతలవుదాం



రక్తదానం చేస్తున్న కూటమి నేతలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఎదుర్కొనే వారి కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి పిలుపునిచ్చారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరింత ఆరోగ్యాన్ని పొందవచ్చని, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కోల్పోయే వారి కోసం దాతలు ఇచ్చే రక్తంతో ఎన్నో వేల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. 20మందికి పైగా నేతలు, కార్యకర్తలు, యువత శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ అంజనేయులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ మాలతి, డాక్టర్లు శివాణి, సోని, ఆసీఫ్, మాలతి, హిమబిందు, గౌతమి, జ్ఞానేశ్వర్, నేతలు కోసూరి రమేష్, మురళి, కేకేనాయుడు, గాంధీపేట రెడ్డి, గోవింద్, సాంబశివ, సయ్యద్‌అమీర్, గంగులప్ప, ఆస్పతి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



రేషన్‌కార్డు అందజేస్తున్న మస్తాన్

మదనపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రేషన్ షాపుల్లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మోతీనగర్‌లోని 13వ వార్డు ఇన్‌చార్జి ఎస్.నస్రీన్‌తాజ్ ఆధ్వర్యంలో శనివారం లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. చౌకదుకాణం 37, 38, 43 షాపుల్లో టీడీపీ మైనార్టీ సీనియర్ నేత ఎస్.ఎ.మస్తాన్ వీటిని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రేషన్‌దుకాణాల వద్ద కార్డుదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అత్యాధునికి టెక్నాలజీ గల ఈ-పాస్‌మిషన్లు, స్మార్ట్‌కార్డులను ప్రవేశ పెట్టిందన్నారు. వీటితో కార్డుదారులు సులభంగా, వేగంగా రేషన్ పొందవచ్చన్నారు. అనంతరం మైనార్టీ నేతను రేషన్‌డీలర్లు సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు ఎస్.మౌలాలి, ఎం.సి.విజయలక్ష్మి, అరుణ, మహేష్, రఘు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కురబలకోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం అంగళ్లు సమీపంలోని విద్యాసంస్థల సమీప దుకాణాల్లో తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ కళాశాల సమీప దుకాణాల్లో గుట్కా, సిగరెట్ విక్రయాలు సాగితే విద్యార్థులు వాటికి బానిసై తమ భవిష్యత్‌ను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దుకాణదారులు స్మోకింగ్ జోన్‌ను ఏర్పాటు చేసి వీటిని ప్రొత్సహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలను వినియోగం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అగాహన కల్పించారు.

స్కౌట్స్ ద్వారా దేశభక్తి పెంపు : డీఈఓ



సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈఓ

పీలేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పీలేరులోని భువన విద్యాలయం పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీకగా నిలిచే స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమంలో భాగస్వాములయ్యే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ గుణలక్ష్మి మాట్లాడారు. అనంతరం డీఈఓ నుంచి విద్యార్థులకు ప్రవేశ సర్టిఫికెట్లు అందజేశారు. మదనపల్లె డిప్యూటీ డీఈఓ లోకేశ్వర రెడ్డి, విద్యాశాఖ కార్యాలయ డైరెక్టర్ రవికుమార్, ఏఎస్ఓసీ లక్ష్మీకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తాం



ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పరిశీలిస్తున్న ఏఈ

వాల్మీకిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా లోటల్టేజ్, ఓవర్‌లోడ్, విద్యుత్ సరఫరాలో అంతరాయం లాంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కార చర్యలు చేపడుతున్నామని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు విషయమై స్థల పరిశీలన ముమ్మరం చేశారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ రవీంద్రనాథ్, సబ్‌ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్, లైన్‌మెన్ శంకర, ట్రాన్స్‌కో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ కళాశాలకు పాడెకట్టిన ప్రభుత్వం'

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం పాడెకట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య ఆరోపించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి గేటు వద్ద సీపీఐ మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పాడెకట్టి నిరసన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలకు కూటమి ప్రభుత్వం ఓపెన్ మార్కెట్‌లో వ్యాపారం పెట్టాందని, పేదలకు వైద్యాన్ని దూరం చేస్తూ వైద్య విద్య చదివే విద్యార్థుల రిజర్వేషన్‌పై దాడి చేస్తున్నట్లు అభివర్ణించారు. సీఎం సహా చాలా మంది మంత్రులు పీపీపీ అంటే ప్రైవేట్ కాదని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పీ4 ముగుగులో కార్పొరేటైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్, సెంట్రలైజేషన్ పద్దతుల్లో మార్చేశారన్నారు. నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలను పీపీపీ పద్దతుల్లోకి మార్చడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని కాపాడతానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే షాజహాన్‌బాష ఎందుకు నోరు విప్పడంలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు రెడ్డి, నరేశ్, మాధవ్, దేవా, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



పవన్‌కళ్యాణ్‌తో జనసేన ఇన్‌చార్జి సాయినాథ్

ములకలచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ కోరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాన్‌ను కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

గుర్రంకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు మూడు రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. 22వ తేదీన సాయంత్రం అంకురార్పణ, 23న ఉదయం యాగశాల, పవిత్ర ప్రతిష్ట అనంతరం స్నపన తిరుమంజనం, 24న పవిత్రాల సమర్పణ, 25న మహాపూర్ణాహుతి, కుంభప్రదక్షిణ, పవిత్రవితరణ, చక్రస్నానం సాయంత్రం తిరువీధి ఉత్సవం ఉంటాయన్నారు.

పీలేరు ఆస్పత్రికి బల్లల వితరణ

పీలేరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పీలేరు ఏరియా ఆస్పత్రికి విశ్రాంత హెచ్ఎం బద్దం రాజారెడ్డి 10 బెంచీలు, 10 స్టూళ్ల వితరణగా అందజేశారు. శనివారం వాటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు అందించారు. రాజారెడ్డి దాతృత్వాన్ని చంద్రశేఖర్ అభినందించారు.

నేడు మహాశివుడికి అన్నాభిషేకం

వాల్మీకిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చాలా అరుదుగా వచ్చే పితాలయ అమావాస్య సందర్భంగా వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయంలో ఆదివారం సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. పిత్రుదేవత ప్రీతిగా పిత్రుసూక్త హోమం, జగన్మంగళ గోముఖాదేవి సమేత లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కలికిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం అన్ని పంచాయతీల్లోనూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభినట్లు పౌరసరఫరాల డీటీ విజయకుమార్ రెడ్డి చెప్పారు. కార్డుల పంపిణీని బాధ్యతను స్థానిక డీలర్లకు అప్పగించామన్నారు. మునేళ్ళపల్లె సర్పంచ్ శశికళ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నేతలు గంగాధరయ్య, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు. గుట్టపాలెంలో మాజీ సర్పంచు కేవీ రెడ్డి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో కార్డులు పంపిణీ చేశారు. అక్టోబరు 1 నుంచి స్మార్ట్ కార్డుల ఆధారంగానే సరుకులు పంపిణీ చేయనున్నట్లు డీటీ విజయకుమార్ రెడ్డి చెప్పారు.